teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు ... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 258 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 23 జనవరి 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## దావోస్ పర్యటన ఫలితంగా రూ. 45,500 కోట్ల పెట్టుబడులు

రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చిన మరో కంపెనీ





## అర్హులందరికీ పథకాలు అందజేస్తం

### గతంలో ఎమ్మెల్యేలు చెప్పినోళ్లకే పథకాలు..

### ఇప్పుడు ప్రజల సమక్షంలోనే ఎంపిక

- 3,410 గ్రామాల్లో సభలు
- 142 ఊళ్లల్లో ఆందోళనలు
- ఆ 4 శాతం గ్రామాల్లోనూ గొడవ చేసింది బీఆర్ఎస్ వాళ్లే
- గ్రామ సభల్లోనూ దరఖాస్తుల స్వీకరణ
- అర్హులందరికీ పథకాలు అందజేస్తం
- మీడియాతో మంత్రి సీతక్క చిట్ చాట్




హైదరాబాద్, జనవరి 22 (తీన్మార్ న్యూస్): పదేండ్ల తర్వాత తెలంగాణలో గ్రామ సభలు జరుగుతున్నాయని మంత్రి సీతక్క అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేలు చెప్పినోళ్లకే పథకాలు అందేవని, ఫాంహౌస్‌లలో లబ్దిదారుల జాబితాలు తయారయ్యేవని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం పారదర్శకంగా పథకాలు అందించనుందని చెప్పారు. గ్రామ సభలు నిర్వహించి ప్రజల సమక్షంలోనే

మిగతా 2 లో

తెలంగాణ

## హైకోర్టుకు అదనంగా 4 న్యాయమూర్తుల నియామకం

### రాష్ట్రపతి ఆమోదంతో కేంద్ర న్యాయశాఖ ఉత్తర్వులు జారీ



న్యూ ఢిల్లీ, జనవరి 22 (తీన్మార్ న్యూస్): తెలంగాణ హైకోర్టుకు నలుగురు అదనపు న్యాయమూర్తులు నియమితులయ్యారు. జస్టిస్ తిరుమల దేవి, జస్టిస్ మధుసూధన్ రావు, జస్టిస్ రేణుకా యార, నర్సింగ్ రావులను హైకోర్టు జడ్జిలుగా నియమిస్తూ 2025, బుధవారం రాష్ట్రపతి ఆమోదంతో కేంద్ర న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తిరుమల దేవి వచ్చే ఏడాది జూన్ 1 వరకు రేణుకా యార, నర్సింగ్ రావు నందికొండ,

మిగతా 2 లో



## వరద నియంత్రణ, ముంపు నివారణ కోసం ప్రత్యేక కమిటీ

### ఈ మేరకు డ్యామ్ సేఫ్టీ స్టేట్ కమిటీ సమావేశం

### గేట్ ఆపరేషన్ ప్రోటోకాల్‌పై అధ్యయనంకై ప్రతిపాదన

కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో వరద నియంత్రణ, ముంపు నివారణ కోసం సంబంధిత అన్ని రాష్ట్రాలతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని, ఆయా బేసిన్లలోని ప్రాజెక్టుల వారీగా గేట్ ఆపరేషన్ ప్రోటోకాల్‌పై అధ్యయనం జరిపించాలని తెలంగాణ ఇరిగేషన్ ఈఎన్సీ అనిల్‌కుమార్ ప్రతిపాదించారు.

హైదరాబాద్, జనవరి 22 (తీన్మార్ న్యూస్): స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్‌లో భాగమైన డ్యామ్ సేఫ్టీ స్టేట్ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. హైబ్రిడ్ విధానంలో కొనసాగిన ఈ సమావేశంలో తెలంగాణ, ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర ఉన్నతాధికారులు, ఇద్దరు ఓయూ ప్రొఫెసర్లు, సీడబ్ల్యూసీ

మిగతా 2 లో




## ముడి జనపనార కనీస మద్దతు ధరను పెంపు

న్యూ ఢిల్లీ, జనవరి 22 (తీన్మార్ న్యూస్): ముడి జనపనార పంట కనీస మద్దతు ధరను పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో బుధవారం కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ భేటీ అయ్యింది. ఇక వ్యవసాయ ఖర్చులు మరియు ధరల కమిషన్

మిగతా 2 లో

## బీఆర్ఎస్ అంటే భారత రాష్ట్ర సమితి మాత్రమే కాదు..?



### భారత రైతు సమితి కూడా అర్థం

### బీఆర్ఎస్ పార్టీకి కొత్త అర్థాన్ని వివరించిన కేటీర్

హైదరాబాద్, జనవరి 22 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తమ పార్టీకి కొత్త అర్థాన్ని వివరించారు. బీఆర్ఎస్ అంటే భారత రాష్ట్ర సమితి మాత్రమే కాదని, భారత రైతు సమితి కూడా అని పేర్కొన్నారు. బుధవారం అన్నదాతల బలవన్మరణాలు, సాగు సంక్షోభంపై ఏర్పాటైన బీఆర్ఎస్ రైతు అధ్యయన కమిటీ సమావేశం అయింది. అధ్యయన కమిటీ చర్చల అనంతరం ఆయన మీడియాతో

మిగతా 2 లో

## ఢిల్లీలో ఫిబ్రవరి 5న అసెంబ్లీ ఎన్నికలు

### ఆమ్ ఆద్మీ పార్టీ తరపున మధ్యతరగతి మ్యానిఫెస్టో విడుదల



న్యూ ఢిల్లీ, జనవరి 22 (తీన్మార్ న్యూస్): దేశరాజధాని ఢిల్లీలో ఫిబ్రవరి 5న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇంతలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ తన పార్టీ తరపున మధ్యతరగతి మ్యానిఫెస్టో' ప్రకటించారు. ఈ మ్యానిఫెస్టోలో ఆయన ఢిల్లీలోని మధ్యతరగతి ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం నుండి ఏడు ప్రధాన డిమాండ్లు చేశారు. ఇప్పటివరకు వివిధ ప్రభుత్వాలు మధ్యతరగతిని

మిగతా 2 లో



## సచివాలయ సందర్శకుల పట్ల ప్రభుత్వ ఆంక్షలు

### పాసుతో ఒక్కరికి మాత్రమే అనుమతి

### పటిష్ట భద్రత, రద్దీలో భాగంగా చర్యలు

హైదరాబాద్, జనవరి 22 (తీన్మార్ న్యూస్): తెలంగాణ సచివాలయంకు వచ్చే సందర్శకుల పట్ల ప్రభుత్వం ఆంక్షలు విధిస్తుంది. ఇకపై సచివాలయం లోపలకు వెళ్లే వారికి ఇచ్చే పాసుతో ఒక్కరికి మాత్రమే అనుమతినిస్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సచివాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే సందర్శకుల పట్ల కఠిన నిబంధనలు అమలు చేయడం తీవ్ర విమర్శల

మిగతా 2 లో



## ఆర్టీసీ డిపోల ప్రైవేటీకరణ అవాస్తవం

### ప్రచారాన్ని ఖండించిన టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం

### ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని స్పష్టం

హైదరాబాద్, జనవరి 22 (తీన్మార్ న్యూస్): ఆర్టీసీ డిపోల ప్రైవేటీకరణ ప్రచారంపై టీజీఎస్ ఆర్టీసీ క్లారిటీ ఇచ్చింది. డిపోల కార్యకాలపాలన్నీ ఆర్టీసీ ఆధీనంలోనే ఉంటాయని ఎలక్ట్రిక్ బస్సుల పేరిట ఆర్టీసీ డిపోల ప్రైవేటీకరణ ప్రయత్నాలంటూ జరుగుతున్న ప్రచారాన్ని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం తీవ్రంగా ఖండించింది. ఈ ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని స్పష్టం చేసింది. రాష్ట్రంలోని

మిగతా 2 లో

## శంషాబాద్ విమానాశ్రయానికి నిఘా వర్గాల రెడ్ అలర్ట్

### గణతంత్ర దినోత్సవ ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా నిర్ణయం





సికింద్రాబాద్, జనవరి 22 (తీన్మార్ న్యూస్): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి నిఘా వర్గాలు రెడ్ అలర్ట్ ప్రకటించాయి. రానున్న

మిగతా 2 లో

## జేఈఈ మెయిన్స్-1 పరీక్షలు ప్రారంభం

### ప్రశ్నలు మధ్యస్తంగా ఉన్నట్టు విద్యార్థులు వెల్లడి





## సినీ ప్రముఖుల ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ సోదాలు

### సోదాలు మొత్తం సినీ పరిశ్రమపై జరుగుతున్నాయ్: దిల్ రాజు

హైదరాబాద్, జనవరి 22 (తీన్మార్ న్యూస్): సినీ ప్రముఖుల ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ అధికారుల సోదాలు రెండోరోజూ కొనసాగాయి. ప్రముఖ నిర్మాత, తెలంగాణ చలన చిత్ర అభివృద్ధి మండలి చైర్మన్ దిల్ రాజుకు చెందిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌తోపాటు మైత్రీ మూవీ మేకర్స్,

మిగతా 2 లో

# అర్హులందరికీ పథకాలు అందజేస్తాం








మొదటి పేజీ తరువాయి

లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని చెప్పారు. బుధవారం మంత్రి మీడియాతో చిట్ చాట్ చేశారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా 3,410 గ్రామాల్లో సభలు నిర్వహించామని అన్నారు. కేవలం 142 గ్రామాల్లోనే ఆందోళనలు జరిగాయని అన్నారు. అంటే కేవలం 4% గ్రామాల్లోనే గొడవలు జరిగాయని తెలిపారు. అది కూడా బీఆర్ఎస్ నాయకులు కావాలనే గొడవలు చేయించారని చెప్పారు. 96% గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో సభలు జరిగినట్టు మంత్రి చెప్పారు. పదేండ్ల తర్వాత గ్రామ సభలు నిర్వహిస్తున్నందున ప్రజలు ఉత్సాహంగా హాజరవుతున్నారని చెప్పారు. ప్రజాస్వామ్య బద్ధంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతుంటే బీఆర్ఎస్ నాయకులు కావాలని రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. పదేండ్లుగా బీఆర్ఎస్ సర్కారు రేషన్ కార్డులు ఇవ్వలేదని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్ మాటలు నమ్మి కొందరు ఆర్థిక రాజకీయ, సామాజిక సర్వేలో పాల్గొనలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వాళ్లకు పథకాలు రావేమోననే ఆందోళన ఉందని అన్నారు. అర్హులందరికీ పథకాలు అందుతాయని, ఆందోళన చెందవద్దని సీతక్క అన్నారు. గ్రామసభల్లో కూడా దరఖాస్తులు తీసుకుంటామని చెప్పారు. వందల ఎకరాల భూమి ఉన్నవారికి గతంలో రైతు బంధు ఇచ్చారని గుర్తు చేశారు.

### త్వరలోనే సర్పంచ్ ఎన్నికలు

ముఖ్యమంత్రి దావోస్ పర్యటన ముగించుకొని వచ్చాక బీసీ కమిషన్ రిపోర్ట్‌పై ఆమోద ముద్రపడుతుందని సీతక్క చెప్పారు. త్వరలోనే సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తామని, ప్రత్యేక అధికారుల పాలన కారణంగా కేంద్రం నుంచి నిధులు ఆగిపోయాయని అన్నారు. స్కీంలకు దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ అని చెప్పారు.

## జేఈఈ మెయిన్స్-1 పరీక్షలు ప్రారంభం

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, జనవరి 22 (తీన్మార్ న్యూస్): ఐఐటీలు, ఎన్ఐటీల్లో బీఈ/బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ మెయిన్స్-1 పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లల్లో పరీక్షలు నిర్వహించగా, ప్రశ్నలు మధ్యస్తంగా ఉన్నట్టు అన్ని అంశాల నుంచి ప్రశ్నలిచ్చినట్టుగా విద్యార్థులు తెలిపారు. భౌతికశాస్త్రంలో థర్మల్ ఫిజిక్స్, ప్రొజెక్షనల్ మోషన్, ఎలక్ట్రికల్ సర్క్యూట్, డయోడ్, విద్యుదయస్కాంత తరంగాలు వంటి వాటి నుంచి ప్రశ్నలిచ్చారు. లోతైన పరిజ్ఞానం కలవారే ఈ ప్రశ్నలను ఛేదించగలరు. ఇక గణితంలోని ప్రశ్నలకు ఆన్సర్లు రాబట్టేందుకు అధిక సమయం పట్టింది. గణాంకాలు, సంభావ్యత, వెక్టర్స్, త్రీడీ జ్యా మితి, నిర్ణాయకాల అంశాలనుంచి ప్రశ్నలిచ్చారు. మొత్తం మూడు విభాగాల్లో కెమిస్ట్రీ సులభంగా ఉండగా, ఫిజిక్స్, గణితం ప్రశ్నలకు కాస్త సమయం పట్టిం ది. గణితం ప్రశ్నలకు అధిక సమయం పట్టిందని శ్రీచైతన్య ఐఐటీ ఆలిండియా కో-ఆర్డినేటర్ ఎం ఉమాశంకర్ విశ్లేషించారు. గతంలో ఫిజిక్స్, కెమిస్ట్రీలు విద్యార్థులను ఇబ్బందిపెట్టేవని,ఈ రెండు సబ్జెక్టుల్లో ప్రశ్నలు సులభంగానే ఇచ్చినట్టు వెల్లడించారు. 100కు 95 పర్సంటైల్ స్కోర్ సాధించవచ్చని తెలిపారు. గురు, శుక్రవారాలతోపాటు ఈ నెల 28న బీటెక్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనుండగా, ఈ నెల 30న బీఆర్క్, బీప్లానింగ్ విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తారు.

## దావోస్ పర్యటన ఫలితంగా రూ. 45,500 కోట్ల పెట్టుబడులు



న్యూ ఢిల్లీ, జనవరి 22 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో మరో కంపెనీ భారీ పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన ఫలితంగా రాష్ట్రంలో రూ. 45,500 కోట్ల అత్యంత భారీ పెట్టుబడి పెట్టేందుకు సన్ పెట్రో కెమికల్స్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కంపెనీ అధికారులు ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా సన్ సంస్థ భారీ పంప్డ్ స్టోరేజి పవర్, సోలార్ పవర్ ప్రాజెక్టు చేపట్టనుంది. ఈ భారీ ప్రాజెక్టులు మంచిర్యాల, ములుగు, నాగర్ కర్నూల్ జిల్లాలకు రానున్నాయి. కాగా ఈ ప్రాజెక్టుల వలన 7 వేల మందికి ఉపాధి లభించే అవకాశాలు ఉన్నాయి.

## వరద నియంత్రణ, ముంపు నివారణ కోసం ప్రత్యేక కమిటీ



మొదటి పేజీ తరువాయి

మెంబర్ కన్వీనర్ పాల్గొన్నారు. డ్యామ్ సేఫ్టీ చట్టం ప్రకారం గత ఏడాదిగా చేపట్టిన చర్యలను ఆయా రాష్ట్రాలు వివరించాయి. ఈ సందర్భంగా కమిటీ ఎదుట తెలంగాణ ఇరిగేషన్ ఈఎన్సీ అనిల్‌కుమార్ పలు ప్రతిపాదనలు పెట్టారు. విజయవాడ ముంపు లాంటి విపత్తులు భవిష్యత్‌లో తలెత్తకుండా చూసేందుకు కృష్ణా, గోదావరి బేసిన్లలోని ప్రాజెక్టులను సమన్వయం చేయాలని, వాటిని ఆపరేట్ చేసేందుకు 4 రాష్ట్రాల సీఈలతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయా ప్రాజెక్టులకు సంబంధించిన వరద ప్రవాహాల తీరుతెన్నులపై ఐఐటీ హైదరాబాద్ లేదా ఐఐటీ రూరీతో అధ్యయనం చేయించాలని, బేసిన్‌లోని అన్ని ప్రాజెక్టుల గేట్ ఆపరేషన్ ప్రోటోకాల్‌ను తయారు చేయాలని కోరారు. రియల్ టైం వర్షపాత వివరాలతోపాటు డాటా ఇంటిగ్రేషన్, రియల్ టైం టెలిమెట్రీ వ్యవస్థల ద్వారా వరదలను అంచనా వేసి నియంత్రించే వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని, వరద నియంత్రణ, ముంపు నివారణ వంటి అంశాలపై ఎగువ, దిగువన ఉన్న రాష్ట్రాలు ఎప్పటికప్పుడు చర్చించుకోవాలని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలకు కమిటీ సానుకూలంగా స్పందించింది.

### పెద్దవాగుకు మరో స్పిల్‌వే

ఎన్డీఎస్ఏ సూచనల మేరకు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లపై పరీక్షలు పూర్తిచేసి నివేదికలను పంపామని, వీటిపై ఎన్డీఎస్ఏ నుంచి ప్రతిస్పందన రావాల్సి ఉన్నదని ఓఅండ్ఎం, ఎస్డీఎస్‌వో ఈఎన్సీ విజయభాస్కర్‌రెడ్డి కమిటీకి నివేదించారు. వరదలతో తెగిపోయిన పెద్దవాగు ప్రాజెక్టుకు శాశ్వత మరమ్మతులు చేసేందుకు 5 గేట్లతో అదనంగా మరో స్పిల్‌వేని నిర్మించాలని సూచించారు. ఈ పనులకు రూ.92.20 కోట్లు ఖర్చవుతాయని, ఆ నిధుల గురించి ఏపీతో చర్చిస్తున్నామని పేర్కొన్నారు. గుండ్లవాగు ప్రాజెక్టు సమస్యల పరిష్కారం కోసం అక్కడ మళ్లీ కొత్త ప్రాజెక్టును నిర్మించాల్సిందేనని ప్యానల్ ఆఫ్ ఎక్స్‌పర్ట్ కమిటీ నివేదించినట్టు వెల్లడించారు. తెలంగాణలోని అన్ని మీడియం, మేజర్ ప్రాజెక్టుల వద్ద వానకాలం ముందు, తర్వాత నిర్వహించాల్సిన పరీక్షలను చేయించామని, అనంతరం చేపట్టిన చర్యలపై అధికారుల నుంచి నివేదిక అడిగామని చెప్పారు. 174 స్పెసిఫైడ్ డ్యాముల లిస్ట్ నుంచి పెద్దచెరువు, చెగావ్ ప్రాజెక్టులను తొలగించి వాటి స్థానంలో చనాకా కొరాటా, సదర్మాట్ బరాజ్‌లను చేర్చామని ఈఎన్సీ తెలిపారు. ఓఅండ్ఎం, ఎస్డీఎస్‌వో ఈఎన్సీ విజయభాస్కర్‌రెడ్డి, సీఈలు సుధాకర్‌రెడ్డి, మోహన్‌కుమార్, అజయ్‌కుమార్, ఓయూ ప్రొఫెసర్ రాజశేఖర్, జేఎన్టీయూ ప్రొఫెసర్ శ్రీనివాసులు, సీడబ్ల్యూసీ, ఇతర రాష్ట్రాల అధికారులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో ఫిబ్రవరి 5న అసెంబ్లీ ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి

విస్మరించాయని, వారిని ప్రభుత్వానికి ఉపయోగపడే ఒక ఏటీఎంగానే పరిగణించాయని కేజ్రీవాల్ విమర్శించారు. పలు రాజకీయ పార్టీలు మధ్యతరగతిని పన్ను చెల్లింపుదారులుగా మాత్రమే చూస్తున్నాయని, వారి సమస్యలను విస్మరించాయని కేజ్రీవాల్ పేర్కొన్నారు. మధ్యతరగతి ప్రజలకు మెరుగైన జీవితంతో పాటు సౌకర్యాలు పొందగలిగేలా వారి సమస్యలకు ప్రాధాన్యత ఇచ్చేందుకు ఆప్ తరపున ఆయన ఈ మ్యానిఫెస్టోను రూపొందించారు.

### ఆప్ ఏడు ప్రధాన డిమాండ్లు

1. పన్ను రహిత ఆరోగ్య బీమా: ఢిల్లీ పౌరులకు ఉచితంగా సమగ్ర ఆరోగ్య బీమాను అందించాలని, తద్వారా వైద్య చికిత్స కోసం ఎవరూ ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన అవసరం ఉండదని ఆప్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.
2. సీనియర్ సిటిజన్లకు ఉచిత చికిత్స: సీనియర్ సిటిజన్లకు పూర్తిగా ఉచిత ఆరోగ్య సంరక్షణ సేవలు అందించాలని పార్టీ కేంద్రాన్ని డిమాండ్ చేసింది.
3. విద్యా హక్కులో మెరుగుదల: ఢిల్లీలో విద్యా స్థాయిని మరింత మెరుగుపరచడానికి సహాయం అందించాలని ఆప్ కేంద్రానికి విజ్ఞప్తి చేసింది.
4. ఉపాధి -ఉద్యోగ భద్రత: ఢిల్లీలో యువతకు ఉపాధి అవకాశాలు, ఉద్యోగ భద్రతను పెంచాలని పార్టీ డిమాండ్ చేసింది.
5. శరళమైన పన్ను విధానం: మధ్యతరగతి వారికి అదనపు పన్ను భారం నుండి ఉపశమనం కలిగించేలా పన్ను విధానాన్ని మరింత శరళంగా మార్చాలని పార్టీ డిమాండ్ చేసింది.
6. ప్రాథమిక సౌకర్యాల మెరుగుదల: ఢిల్లీలో నీరు, విద్యుత్, రోడ్లు, పారిశుధ్యం వంటి ప్రాథమిక సౌకర్యాలను మెరుగుపరచడానికి కేంద్రం నుండి సహాయం కోరింది.
7. గృహనిర్మాణ పథకాలలో సహాయం: ఢిల్లీలోని పేదలు, మధ్యతరగతి వారికి అందుబాటు ధరలలో గృహనిర్మాణ పథకాలను అందించాలని ఆప్ విజ్ఞప్తి చేసింది.

అరవింద్ కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడుతూ మా పార్టీ ఢిల్లీ ప్రజలకు అండగా నిలిచింది. అయితే మధ్యతరగతి వారికి కేంద్ర ప్రభుత్వం నుండి ఎటువంటి ఉపశమనం లభించలేదు. దీనిని మార్చడానికి, ఢిల్లీలోని అన్ని తరగతుల గొంతును ప్రభుత్వానికి వినిపించడానికి కృషి చేస్తాం అని పేర్కొన్నారు.

## ఆర్టీసీ డిపోల ప్రైవేటీకరణ అవాస్తవం

మొదటి పేజీ తరువాయి

ఆర్టీసీ డిపోలు ప్రైవేట్ సంస్థల పరిధిలోకి వెళ్లిపోతున్నాయనే దుష్ప్రచారం పూర్తి అవాస్తవమని స్పష్టత ఇచ్చింది. ఎలక్ట్రిక్ బస్సుల మెయిన్‌టనెన్స్, చార్జింగ్ మినహా ఆపరేషన్స్ అంతా టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలోనే జరుగుతుందని స్పష్టం చేసింది. ఎలక్ట్రిక్ బస్సులను నేరుగా కొనాలంటే వ్యయంతో కూడుకున్న పని అని ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వ ఈవీ పాలసీ మేరకు గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్(జీసీసీ) పద్ధతిన అంటే బస్సు తిరిగే కిలోమీటర్ల ప్రకారం కంపెనీలకు చెల్లింపులు చేయడం జరుగుతుంది. అంతేతప్ప డిపోలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రసక్తి లేదని క్లారిటీ ఇచ్చింది. కేంద్రప్రభుత్వ ఫాస్టర్ అడాప్షన్ అండ్ మ్యానుఫాక్చరింగ్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికిల్స్(ఫేమ్)-1 స్కీమ్‌లో భాగంగా 2019 మార్చిలో 40 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్(జీసీసీ) పద్ధతిన ప్రవేశపెట్టడం జరిగిందని, పుష్పక్ పేరుతో హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మార్గంలో ఈ బస్సులను సంస్థ నడుపుతోంది. బస్సుల మెయిన్‌టనెన్స్, చార్జింగ్ మినహా ఆపరేషన్స్ అంతా టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలోనే జరుగుతోందని వివరణ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఈవీ పాలసీ ప్రకారమే పర్యావరణహితమైన ఎలక్ట్రిక్ బస్సులను ప్రజలకు సంస్థ అందుబాటులోకి తీసుకువస్తోందని తెలిపింది. డిపోల్లో ఎలక్ట్రిక్ బస్సులతో సహా అన్ని బస్సుల ఆపరేషన్స్ నిర్వహణ పూర్తిగా టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలోనే జరుగుతుందని, అందులో ఎలాంటి అనుమానాలు అవసరం లేదని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ ఈవీ పాలసీ ప్రకారం హైదరాబాద్‌తో సహా వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, నల్లగొండ, సూర్యాపేట, తదితర



ప్రాంతాల్లో ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురావడం జరుగుతోందని తెలిపింది. 2023 మార్చిలో కేంద్ర ప్రభుత్వ నేషనల్ ఎలక్ట్రిక్ బస్ ప్రోగ్రాం(ఎన్ఈబీపీ) కింద 550 ఇంటర్ సిటీ ఎలక్ట్రిక్ బస్సులకు, 500 సిటీ బస్సులకు సొంత టెండర్ ద్వారా ఆర్డర్ ఇవ్వడం ఇవ్వడం జరిగిందని వాటిలో 170 సిటీ, 183 జిల్లాల బస్సులు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయని తెలిపింది. ప్రైవేట్ సంస్థల జాప్యం వల్ల మిగతా ఎలక్ట్రిక్ బస్సులు రావడంలో ఆలస్యం జరుగుతోంది. మిగిలిన బస్సులు ఈ ఏడాది మే వరకు సంస్థకు అందజేస్తామని ప్రైవేట్ సంస్థలు పేర్కొన్నాయని తెలిపారు.

ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్‌లోని ఆరు డిపోలతో పాటు వరంగల్-2, కరీంనగర్- 2, నిజామాబాద్- 2 డిపోల్లో ఈ ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయని వెల్లడించారు.

## తెలంగాణ హైకోర్టుకు అదనంగా 4 న్యాయమూర్తుల నియామకం

మొదటి పేజీ తరువాయి



మధుసూధన్ రావులు రెండేళ్ల పాటు అదనపు న్యాయమూర్తులుగా కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొంది. 2025 జనవరి 11న జరిగిన భేటీలో నలుగురు జిల్లా కోర్టు జడ్జిలను తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించేందుకు సుప్రీంకోర్టు కొలీజియం ఆమోదం తెలిపింది. జిల్లా జడ్జిల కోటాలో సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి రేణుక యారా, సిటీ సివిల్ స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్ జడ్జి నందికొండ నర్సింగ్‌రావు, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఇ.తిరుమలాదేవి, హైకోర్టు రిజిస్ట్రార్ (పరిపాలన) బి.ఆర్.మధుసూదన్‌రావు పేర్లను కేంద్రానికి సిఫారసు చేసింది. కేంద్రం పరిశీలన అనంతరం సుప్రీం కోర్టు కొలిజియం సిఫారసులకు బుధవారం రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. రాష్ట్రపతి ఆమోదంతో ఈ నలుగురని హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా నియమిస్తూ కేంద్ర న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

## ముడి జనపనార కనీస మద్దతు ధరను పెంపు

మొదటి పేజీ తరువాయి

సూచనలు, సిఫార్సుల మేరకు ఈ రా జూట్ మద్దతు ధర పెంపునకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం లభించింది. క్వింటాల్‌పై రూ. 315 పెరగ్గా 2025-26 సీజన్‌కు సంబంధించి ఈ పంట మద్దతు ధర రూ.5650కి పెరిగినట్లు వెల్లడించింది. అంతకుముందు. 2014-15లో భారత ముడి జనపనార క్వింటాలుకు రూ.2400 ఉండగా అది 2025-26లో రూ.5,650కి పెరిగింది. దీంతో, క్వింటాలుకు కనీస మద్దతు ధర 2.35 రెట్లు పెరిగినట్టైంది. దీంతో ముడి జనపనార పంట పండించే రైతులు సంతోషంలో ఉన్నారు. మద్దతు ధర పెంచిన నేపథ్యంలో ఇతర పంటలు వేసే వారు కూడా దీనిపై ఆకర్షితులు అయ్యే అవకాశం ఉంటుంది. ఇక ఈ నిర్ణయం వల్ల పంట ఉత్పత్తి వ్యయం కంటే 63 శాతం ఎక్కువగా రిటర్న్ పొందే అవకాశం ఉందని అంచనా.

40 లక్షల కుటుంబాలకు 40 లక్షల వ్యవసాయ కుటుంబాల జీవనోపాధి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జ్యూట్ పరిశ్రమపై ఆధారపడి ఉంటుంది. దాదాపు 4 లక్షల మంది కార్మికులు జూట్ మిల్లులలో ప్రత్యక్ష ఉపాధిని పొందుతారు. గతేడాది 1.7 లఖక్షల మంది రైతుల నుంచి జనపనారను సేకరించారు. జనపనార పండించే రైతులలో 82 శాతం మంది పశ్చిమ బెంగాల్‌కు చెందినవారు కాగా అసోం, బిహార్ రైతులు 9 శాతం జూట్ ని ఉత్పత్తి చేస్తారు. అంతేకాకుండా, జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ధర మద్దతు కార్యకలాపాలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వానికి నోడల్ ఏజెన్సీగా కొనసాగుతుంది. ఇలాంటి సందర్భాల్లో రైతులకు ఏదైనా నష్టం సంభవిస్తే కేంద్ర ప్రభుత్వం పూర్తిగా రీఎంబర్స్ చేస్తుంది.

## సచివాలయ సందర్శకుల పట్ల ప్రభుత్వ ఆంక్షలు

మొదటి పేజీ తరువాయి

పాలైంది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాదీ ప్రజాప్రభుత్వమంటూ ఆంక్షలను సడలించింది. అయితే సందర్శకుల తాకిడి అధికం కావడంతో పాటు భద్రత పటిష్టం చేసే క్రమంలో ఎస్పీఎఫ్ సిబ్బంది సందర్శకుల సంఖ్యను క్రమబద్ధీకరించే చర్యలను క్రమంగా అమల్లోకి తేవడం ప్రారంభించారు. ప్రస్తుతం సచివాలయంలో సీఎం కార్యాలయం ఉండే ఆరో అంతస్థుకు విజిటర్స్ అనుమతి నిరాకరించారు. నిన్న చీఫ్ సెక్రటరీ ఫ్లోర్ లో సందర్శకులు ఎక్కువగా కనిపించడంతో ఉన్నతాధికారులు ఎస్పీఎఫ్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సందర్శకులపై కొత్త ఆంక్షలు తీసుకొచ్చారు. ఇటీవల ప్రభుత్వం సచివాలయంలో వాస్తు పేరుతో మార్పులు చేసి తూర్పు వైపున ప్రధాన ద్వారం (బాహుబలి ద్వారం) మూసివేశారు. ఈశాన్యం వైపుకు ప్రధాన గేటును మార్చారు. ఉద్యోగులు, అధికారుల హాజరుకు బయోమెట్రిక్ పద్ధతిని అమలులోకి తెచ్చారు. తాజాగా సందర్శకులపై ఆంక్షలు అమల్లోకి తెచ్చారు.

## బీఆర్ఎస్ అంటే భారత రాష్ట్ర సమితి మాత్రమే కాదదు..?

మొదటి పేజీ తరువాయి

మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రైతుకు అధిక ప్రాధాన్యత ఇచ్చామని తెలియజేశారు. పంటలకు మద్దతు ధర, రుణమాఫీ, రైతు భరోసా ఇస్తామన్న కాంగ్రెస్ మాటలు నమ్మి వారిని గెలిపిస్తే ఇపుడు వారిని పట్టించుకోవడం లేదన్నారు.

కాంగ్రెస్ ప్రయారిటీ ఫార్ములా రేస్ అయితే తమ ప్రయారిటీ ఫార్మర్స్ అన్నారు. రాష్ట్రంలో రైతులు బాగుండాలనేదే బీఆర్ఎస్ ఉద్దేశం అని ఎద్దు ఏడ్చినా వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు కన్నీళ్లే మిగిలాయన్నారు. ఆ కన్నీళ్ళు తుడవటానికి తాము రాష్ట్రమంతా నెలరోజుల పాటు పర్యటనలు చేసి రైతుల గోడు వింటామని తెలిపారు. బీఆర్ఎస్ అధ్యయన కమిటీ ఈనెల 24 నుంచి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా నుంచి పర్యటన మొదలు పెట్టి ఫిబ్రవరి చివరి వారం దాకా రైతు రుణమాఫీ ఎంతవరకు జరిగింది, పంటలకు కరెంట్ సరఫరా ఎలా ఉంది, పంట మద్ధతు ధర ఇస్తున్నార లేదా, రైతుల. ఆత్మహత్యలు వంటి విషయాలను అధ్యయనం చేసి తమ అధినేత కేసీఆర్ కు నివేదిక అందజేస్తామని కేటీఆర్ వెల్లడించారు.

## శంషాబాద్ విమానాశ్రయానికి నిఘా వర్గాల రెడ్ అలర్ట్

గణతంత్ర దినోత్సవం నేపథ్యంలో దేశంలోని అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాలకు కేంద్ర నిఘా వర్గాలు రెడ్ అలర్ట్ ప్రకటించాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో విమానాశ్రయానికి మరింత భద్రతను పెంచి గట్టి నిఘా ఏర్పాటు చేశారు. అదే విధంగా జనవరి 30వ తేదీ వరకు సందర్శకులు ఎవరూ ఎయిర్‌పోర్ట్‌కు రావొద్దని ఆదేశాలు జారీ చేశారు.

## సినీ ప్రముఖుల ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ సోదాలు

మొదటి పేజీ తరువాయి

మ్యాంగో సంస్థల కార్యాలయాలు, కొందరు సినీ ఫైనాన్షియర్ల ఇళ్లలో మంగళవారం ఉదయం నుంచి మొదలైన సోదాలు, బుధవారం రాత్రి వరకు కొనసాగాయి. భారీ బడ్జెట్ చిత్రాలు రూపొందించే వారిపై ఐటీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. అధికారులు 55 బృందాలుగా మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో ఈ సోదాలు సాగించారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, కొండాపూర్ ప్రాంతాల్లో సోదాలు కొనసాగాయి. దిల్‌రాజు, ఆయన కూతురు హన్సిత, సోదరుడు శిరీష్ నివాసాల్లో సోదాలు చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ కార్యాలయం, నిర్మాతలు నవీన్ ఎర్నేని, రవిశంకర్ ఇళ్లు, మ్యాంగో సంస్థల యజమాని యరపతినేని రామ్ ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. సినీ ఫైనాన్షియర్స్ సత్య రంగయ్య, అభిషేక్ అగర్వాల్ ఇళ్లల్లోనూ సోదాలు జరిపారు. ఆయా సంస్థల బ్యాలెన్స్ షీట్స్, బ్యాంకు లావాదేవీలను అధికారులు పరిశీలించినట్లు సమాచారం. తనిఖీలు జరిగిన ప్రాంతాల్లో కేంద్ర బలగాలను మోహరించారు. ఐటీ దాడులపై దిల్‌రాజు స్పందించారు. తన ఒక్కరి ఇళ్లు, కార్యాలయాల్లోనే సోదాలు జరగడం లేదని సినీ ఇండస్ట్రీ మొత్తంపై జరుగుతున్నాయని తెలిపారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# సౌత్ సొమ్ములతో నార్త్... సోకులు

జనాభా తగ్గడం వల్ల దక్షిణ భారత రాష్ట్రాలకు సమీప భవిష్యత్ లో చాలా రకాలుగా నష్టాలు, సవాళ్లు ఎదురవబోతున్నాయి. ఇక్కడి వ్యాపార గ్యాప్, ఉద్యోగాల గ్యాప్ ను ఉత్తరాది రాష్ట్రాలు ఫిలప్ చేసే ఛాన్సెస్ ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే అది చాలా స్పష్టంగా కనిపిస్తోంది. ప్లంబింగ్ దగ్గర్నుంచి హౌస్ కన్స్ట్రక్షన్, ఐటీ దాకా నార్త్ జనమే సౌత్ లో పెరుగుతున్నారు. ఇక సౌత్ స్టేట్స్ లో వ్యాపారాలు చేసేందుకు రాజస్థాన్, యూపీ సహా ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున వలస వస్తున్నారు. మంచి పొజిషన్ కు వెళ్తున్నారు. కారణం ఇక్కడ భారీ గ్యాప్ ఉండడమే. వాళ్ల రాష్ట్రాల్లో పోటీ ఎక్కువుండడం, జనాభా ఎక్కువుండడంతో సౌత్ కు తరలి వస్తూనే ఉన్నారు.రైట్ ఈ ఏడాది జనగణన జరగబోతోంది. ఇది 2026 దాకా కొనసాగుతుంది. ఆ లెక్కల ప్రకారమే నియోజకవర్గాల పునర్విభజన ఉండబోతోంది. అంటే జనం ఎక్కడ ఎక్కువుంటే అన్నేసి నియోజకవర్గాలు పెరుగుతాయన్న మాట. అదే జరిగితే జనం తక్కువగా ఉన్న సౌత్ లో నియోజకవర్గాల్లో పెద్దగా మార్పు ఉండదు. అదే టైంలో నార్త్ లో ముఖ్యంగా యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి చోట్ల విపరీతమైన జనాభాతో ఎక్కువ సీట్లు పెరిగే అవకాశం ఉంటుంది. సీట్లు ఒక్కటే కాదు? నిధుల పంపిణీ కూడా జనాభా ఆధారంగానే జరుగుతుంది. ఇప్పుడు కూడా అలాగే నడుస్తోంది. అందుకే సౌత్ స్టేట్స్ చాలా టెన్షన్, అటెన్షన్ తో ఉన్నాయి. కేంద్రం నుంచి అందాల్సిన నిధులపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందుతున్నాయజనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేస్తే దక్షిణాదికి తీరని అన్యాయం జరుగుతుందని, దక్షిణాది-ఉత్తరాది అనే చర్చ వచ్చే ఆస్కారం ఉంది కాబట్టి కేంద్ర ప్రభుత్వమే దీనికి స్పష్టమైన విధాన రూపకల్పన చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఎప్పటి నుంచో చెబుతున్నారు. దేశ జనాభాలో సౌత్ స్టేట్స్ 18 శాతమే ఉన్నా.. జీడీపీలో వాటా 35శాతంగా ఉంది. అంతెందుకు తలసరి ఆదాయం విషయంలో జాతీయ సగటు కంటే దక్షిణాది రాష్ట్రాలే టాప్. కానీ ఏం లాభం? కేంద్ర నిధుల పంపిణీ మాత్రం జనాభా ఎక్కువున్న రాష్ట్రాలకే ఎక్కువ అన్న ఫార్ములా టోటల్ గా ఎఫెక్ట్ చూపుతోంది. 1 970ల్లో కేంద్ర ప్రభుత్వం జనాభా నియంత్రణ కార్యక్రమాలు చేపట్టింది. వీటిని సౌత్ స్టేట్స్ పక్కాగా అమలు చేసి అభివృద్ధికి బాటలు వేశాయి. కానీ ఉత్తరాది రాష్ట్రాలు జనాభాను కంట్రోల్ చేయలేకపోయాయి. అదుపు చేసుకోకుండా పెంచుకుంటూ వెళ్లాయి. ఇదే ఇప్పుడు సమస్యగా మారుతోంది. జనాభాను నియంత్రించుకుని ఇప్పుడు ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక నష్టపోవాల్సిన పరిస్థితి వచ్చింది. జన సంఖ్య అదుపు చేసుకోలేకపోయిన ఉత్తరాది రాష్ట్రాలు లాభపడే సీన్ ఏర్పడింది. అందుకే జనాభా ప్రాతిపదికన నిధుల బట్వాడా కాకుండా ఆర్థికంగా మంచి పర్ఫార్మెన్స్ చూపే ఆధారంగా ఇవ్వాలంటున్నారు. అది జరగాలంటే రాజ్యాంగంలోని ఆర్టికల్ 81కు సవరణ చేయడం ద్వారా దక్షిణ భారత రాష్ట్రాలు నష్టపోకుండా కొత్త ఫార్ములా తీసుకురావాలి. కానీ ఇది చేసేదెవరు? దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల వాదన వినేదెవరన్న చర్చ జరుగుతోంది.. జనవరి నెలకు గానూ కేంద్రపన్నుల్లో రాష్ట్రాల వాటాను ఎలా పంచిందో? మొత్తం లక్షా 73 వేల 30 కోట్లను 28 రాష్ట్రాలకు డిస్ట్రిబ్యూట్ చేసింది. ఇందులో బిమారూ స్టేట్స్ అని నాలుగు రాష్ట్రాలకు పేరుంది. అవి బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్. ఇందులో బిహార్ కు ఏకంగా 17 వేల 403 కోట్లు, మధ్యప్రదేశ్ కు 13,582 కోట్లు, రాజస్థాన్ కు 10 వేల 426 కోట్లు, ఇక ఉత్తరప్రదేశ్ కు ఏకంగా 31 వేల 39 కోట్లు పంచింది కేంద్రం. ఇది 2025 జనవరి పన్నుల వాటా లెక్కలు. ఇందులో టాప్ త్రీలో బిమారూ రాష్ట్రాలైన యూపీ, బిహార్, మధ్యప్రదేశే ఉన్నాయి. మరి ఆ రాష్ట్రాల నుంచి కేంద్రానికి వెళ్లింది గోరంత. తీసుకున్నవి కొండంత.నిన్న మొన్నటిదాకా భారత్ కు యువతే బలం, యువశక్తి ఎక్కువున్న దేశం అంటూ అంతా మాట్లాడుకునే వారు. కానీ ఇప్పుడు అది తగ్గుతోంది. ఇకపైనా తగ్గుముఖమే పడుతుందని పరిస్థితులు చెబుతున్నాయి. అందుకే గతంలో జనాభా నియంత్రణ అన్న వారే ఇప్పుడు కనండి బాబూ కనండి అంటున్నారు. కథ మార్చాల్సిన టైం వచ్చిందంటున్నారు. లేకపోతే పెను నష్టం తప్పదంటున్నారు. జనాభా పెరగకపోతే నిజంగానే అంత పెద్ద నష్టం ఉందా?జనాభా లెక్కల విషయంలో చైనా నుంచి మొదలు పెడుదాం. ఒకప్పుడు చైనా ప్రపంచంలోనే ఎక్కువ జనాభా ఉన్న దేశంగా ఉండేది. కానీ భారత్ దాన్ని అధిగమించింది. సీన్ కట్ చేస్తే ఇప్పుడు వరుసగా మూడో ఏడాది చైనాలో జనాభా తగ్గిపోయినట్లు లెక్కలు రిలీజ్ చేసింది. దీంతో అక్కడ భయాలు పెరుగుతున్నాయి. ఎందుకంటే ఓవైపు వృద్ధుల జనసంఖ్య పెరుగుతోంది. అదే సమయంలో పని చేసే యువత సంఖ్యలో తగ్గుదల స్పష్టంగా కనిపిస్తోంది. చైనా ఒక్కటే కాదు తూర్పు ఆసియాలో, జపాన్, సౌత్ కొరియా, హాంకాంగ్ లోనూ జనాభా పడిపోయింది. ఇందుకు కారణం పెరుగుతున్న ఖర్చులు, విద్య, ఉద్యోగం అనే సరికి పెళ్లిళ్లు, ఆ తర్వాత సంతానాలు వాయిదా పడుతున్నాయి. చైనాకు బలం ఆ దేశ జనాభానే. ప్రపంచంలో ప్రస్తుతం రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. ఇది ఫస్ట్ ప్లేస్ కు రాకముందే వృద్ధుల సంఖ్య పెరిగి రివర్స్ అవుతుందన్న భయాలు వారిని వెంటాడుతున్నాయి. 2100 నాటికి చైనా జనాభా 73 కోట్లు ఉంటుందన్న అంచనాలు ఆ దేశ ఆర్థికవ్యవస్థకు పెను సవాళ్లే.ఇప్పుడు మనదేశం విషయానికొద్దాం. కొన్ని రాష్ట్రాల్లో విపరీతంగా జనాభా ఉంటే ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రం తగ్గుతోంది. సో ఆటోమేటిక్ గా జనాభా ఎక్కువున్న రాష్ట్రాల్లో విద్య, ఉపాధి, ఉద్యోగ, వ్యాపార అవకాశాలు లేని వారంతా దక్షిణ భారత రాష్ట్రాలకు విపరీతంగా వలస వస్తున్నారు. ఇక్కడున్న జనాభా గ్యాప్ ను వలసలతో ఫిల్ చేస్తున్నారు. ఇది శాశ్వత పరిష్కారం కాదు. ఒకప్పుడు కుటుంబ నియంత్రణ చర్యల్లో భాగంగా సౌత్ ఇండియన్ స్టేట్స్ కట్టుదిట్టంగా ఆ రూల్ ను ఫాలో అయ్యాయి. ఇంటికి ఒకరు లేదా ఇద్దరి వరకే సంతానాన్ని సరిపెట్టారు. కానీ ఇప్పుడు అలాగే ఉంటే కుదిరే పరిస్థితి కనిపించడం లేదు. అందుకే ఏపీ సీఎం చంద్రబాబు ప్రతి సందర్భంలోనూ ఇదే మాట మాట్లాడుతున్నారు జనాభానే అసలైన ఆస్తి అన్నది ప్రస్తుతం డౌన్ ట్రెండ్ లో ఉన్న చైనా ఆందోళన చూస్తే అర్థమవుతోంది. ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఆందోళన చూస్తే అర్థం చేసుకోవచ్చు.

# ప్రజాస్వామ్యానికి పత్రికలే పట్టుకొమ్మలు

- ఎమ్మెల్యే మేఘా రెడ్డి
- ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే



వనపర్తి, జనవరి 22 (తీన్మార్ న్యూస్): ప్రజాస్వామ్య వ్యవస్థలను బలపరచడంలో పత్రికలు కీలక పాత్ర పోషిస్తాయని ఎమ్మెల్యే మేఘా రెడ్డి పేర్కొన్నారు. వనపర్తి పట్టణంలో జరిగిన ప్రజాపక్షం దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పత్రికలు ప్రజల సమస్యలను ప్రభుత్వానికి చేరవేసే వేదికలుగా పనిచేస్తాయి. అవి ప్రజల హక్కులను రక్షించే కవచాలుగా నిలుస్తాయి. ప్రజాస్వామ్య విలువలను పత్రికలు కాపాడుతాయి. పత్రికలు మాత్రమే కాదు, ఎలక్ట్రానిక్ మీడియా మరియు డిజిటల్ మీడియా కూడా సమాజంలోని ప్రతి పౌరుడి కర్తవ్యాలను గుర్తు చేసే సాధనాలుగా నిలుస్తున్నాయి" అని అన్నారు. ప్రజా పక్షం దినపత్రిక ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి, నాయకుల దృష్టికి తీసుకురావడంలో ప్రథమ స్థానం ఇస్తుందని ఎమ్మెల్యే తూడి మెగారెడ్డి అన్నారు. అత్యంత పారదర్శకంగా పనిచేసే పత్రికలు ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలపరుస్తాయని, ప్రతి వ్యక్తి బాధ్యతాయుతంగా సమాచారాన్ని పంచుకోవాలని ఎమ్మెల్యే మేఘా రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూ (ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి,ప్రజాపక్షం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గుండ్రాతి మధు గౌడ్,జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి డి. మాధవరావు,పట్టణ మాజీ అధ్యక్షులు బి. లక్ష్మణ్ జిల్లా సీనియర్ నాయకులు ఎల్. రవికాంత్,విజయ్,ప్రజాపక్షం రిపోర్టర్లు సి,ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, రమేష్, సలీం, రమేష్, వేణుగోపాల్, శ్రీకాంత్, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఇష్టానుసారంగా ఫర్టిలైజర్ దుకాణాలు

- అధిక ధరలకు ఎరువుల విక్రయాలు
- ఫర్టిలైజర్ షాపు యజమానులు నిబంధనలను అతిక్రమిస్తున్నారు
- ఫర్టిలైజర్ షాపు యజమానులు ఉద్దేశపూర్వకంగా కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు
- వ్యాపారులు తమ లాభాలు కలిపి మరింత అధిక ధరకు రైతులకు అమ్ముతున్నారు
- మండలం ప్రజలు ఆరోపణలు






దేవరకద్ర ప్రతినిధి,జనవరి22(తీన్మార్ న్యూస్):ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతులకు ఎరువులు విక్రయించాల్సి ఉండగా ఫర్టిలైజర్ షాప్ యజమానులు నిబంధనలు తుంగలో తొక్కి అదే అధిక ధరలకు విక్రయిస్తుండడంతో వనపర్తి జిల్లా మదనాపురం మండలం రైతులు లబోదిబోమంటున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను ఫర్టిలైజర్ షాపు యజమానులు తమకు ఇష్టమొచ్చిన ధరలకు అమ్ముతూ రైతుల నడ్డి విరుస్తున్నారు.ఎరువులను కొనుగోలు చేసే సమయంలో యూరియాను అధిక ధరలకు విక్రయించడమే కాకుండా ఇతరత్రా మందులను కొనాల్సిందేనని కొర్రీలు పెడుతూ రైతులను నిలువునా దోచుకుంటున్నారు. మండలంలో గత కొన్ని రోజుల నుంచి ప్రస్తుతం యాసంగి రబీ పంటల సీజన్ జోరందుకున్నాయి. ఇదే అదునుగా భావించిన మదనాపురం ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తున్నారని మండలం ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు.ఒక సంచి యూరియా బస్తా పైన రూ.100 నుండి రూ.90 రూపాయల వరకు రైతుల వద్ద నుంచి అధికంగా వసూలు చేస్తున్నారు. పలు షాపులు ఒక యూరియా బస్తా రూ. 267 రూపాయలు అమ్మాల్సి ఉండగా ఫర్టిలైజర్స్ యజమానులు మాత్రం రూ.330 నుండి రూ. 350 రూపాయల వరకు రైతుల నుండి వసూలు చేస్తు నిలువు దోపిడీ చేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

# వైద్య ఆరోగ్య సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- నూతన దయాలసిస్ సెంటర్ ని ప్రారంభించిన రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి





ఆత్మకూర్, జనవరి 22 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో బుధవారం రోజు మూడు కోట్ల 50 లక్షలతో నూతనంగా నిర్మించిన దయాలసిస్ సెంటర్ ని తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు దామోదర్ రాజ నరసింహ మక్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలోని రోగులను సందర్శించి అక్కడి సమస్యలను విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణ కేంద్రంలో 22 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించబోయే 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్య సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా వారు అన్నారు. ఇట్టి కార్యక్రమంలో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, జిల్లా డిఎస్పి వెంకటేశ్వర్లు, టిపిసిసి అధికార ప్రతినిధి రాష్ట్ర కల్లుగీత కార్మిక విభాగ అధ్యక్షులు కేశం నాగరాజు గౌడ్ వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మొగిలి గంగాధర్ గౌడ్,ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాయచూరు పరమేష్ పట్టణ అధ్యక్షులు నల్గొండ శ్రీనివాసులు మక్తల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ నాయకులు తులసిరాజ్ యాదవ్ మాజీ మండల అధ్యక్షులు రహమతుల్లా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు ఎన్ఎస్యుఐ యువనాయకులు ఆయా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తులను సంబంధిత పోర్టల్ లో నమోదు చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 22 (తీన్మార్ న్యూస్): ప్రజాపాలన గ్రామ సభల్లో ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత పోర్టల్ లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి మండల, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు తహసీల్దార్లు, ఎంపిడిఓలతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 26వ తేది నుండి అమలు చేయనున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల వంటి పథకాలకు సంబంధించి అన్ని గ్రామ పంచాయతిలు, మున్సిపల్ వార్డుల్లో ఈ నెల 21 నుండి 24 వరకు ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. గ్రామసభలలో దరఖాస్తు దారుల జాబితాలో లేని ప్రజల నుండి దరఖాస్తులను ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి స్వీకరించడం జరుగుతుందని, స్వీకరించిన దరఖాస్తులను ఏరోజుకారోజు పోర్టల్ లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రశాంతంగా గ్రామ సభలు నడుస్తున్నాయని, ప్రజల సహకారం అందిస్తున్నారని అభినందించారు. ప్రతి రోజు 4 గంటల వరకు గ్రామసభల నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. రేపటి గ్రామ సభల గురించి ముందు రోజే ఆయా గ్రామాలు, మున్సిపల్ విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి విజయ భాస్కర్, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, తహసిల్దారులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# 20వ వార్డులో సైడ్ డ్రైనేజ్ స్థల పరిశీలన చేస్తున్న మున్సిపల్ చైర్మన్



పరకాల, జనవరి 22 (తీన్మార్ న్యూస్): బుధవారం పరకాల మున్సిపల్ పరిధిలోని 20వ వార్డు వెల్లంపల్లి రోడ్డులో గల సైడు డ్రైనేజ్ స్థల పరిశీలన చేస్తున్న పరకాల మున్సిపల్ చైర్మన్ సోదా అనిత రామకృష్ణ ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఏకు రాజు, మున్సిపల్ ఏఈ రంజిత్, నాయకులు బొచ్చు శ్రీనివాస్, బొచ్చు సాల్మన్, రేండ్ల సంపత్, వేముల ఆంజనేయులు, సాదు రఘువీర్, తెప్ప కన్నయ్య, దేవీఎన్ చారి, కొండపల్లి చందు, బొచ్చు మోహన్, మునుగంటి విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే చల్లా



నడికుడ, జనవరి 22 (తీన్మార్ న్యూస్): పంచాయతీ రాజ్ శాఖ ఈఈ గూడెం శంకరయ్య తల్లి గూడెం నర్సవ్వ కొద్దిరోజుల క్రితం మృతిచెందగా నడికుడ మండలం చౌటుపర్తి గ్రామంలో ఆమె దశదిన ఖర్మలో పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి. ఆయన వెంట నడికుడ,పరకాల మండలాల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు ఉన్నారు.

# నేడు ఆత్మకూర్ కి మహబూబ్నగర్ ఎంపీ రాక



ఆత్మకూరు, జనవరి 22 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూర్ మున్సిపాలిటీ పరిధిలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలజీవన్ సమృద్ధి యోజనలో భాగంగా 9 కోట్ల 11 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టబోయే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి మహబూబ్నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణమ్మ ముఖ్య అతిథులుగా రానున్నారు. ఇట్టి కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆత్మకూరు మండల బిజెపి అధ్యక్షులు అశోక్ భూపాల్ యాదవ్ ఒక ప్రకటన లో తెలిపారు.

# ఆన్లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

అమరచింత జనవరి 22 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా అమరచింత మండలం క్రిష్ణంపల్లి గ్రామంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ప్రజలు ఆన్లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎవరు కూడా తమ ఏటీఎం పిన్ సి వి వి వంటి వివరాలను ఎవరికి కూడా తెలపరాదని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు పాల్పడితే 1930 నెంబర్ కి సంప్రదించాలని, ప్రధానమంత్రి సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వాటి యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఇట్టి కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్లు మస్తానయ్య బీచుపల్లి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వివేకానంద విగ్రహం ఆవిష్కరణలో పాల్గొన్న జిల్లా ఉద్యమకారుల ఫోరమ్ అధ్యక్షులు



జగిత్యాల, జనవరి 22 (తీన్మార్ న్యూస్): బుధవారం జగిత్యాల జిల్లా ఉద్యమకారుల ఫోరమ్ అధ్యక్షులు జవ్వాజి శంకర్ జిల్లాలోని మినీ స్టేడియంలో స్వామి వివేకానంద విగ్రహం డాక్టర్ సంజయ్ కుమార్ జగిత్యాల ఎమ్మెల్యే ఆవిష్కరించడంలో భాగంగా పాల్గొనడం జరిగింది. ఆ మహనీయుల బాటలో యూవత నడవాలని వారు చూపిన మార్గంలో నడవాలని చేడు మార్గంలో పోవద్దని సమాజానికి మన కుటుంబానికి మంచి పేరు తేవాలని మనం సమాజంలో ఎంతో కొంత సమాజ సేవచేయాలి వివేకానందుని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.

# రోడ్ సేఫ్టీ భద్రత ట్రాఫిక్ నియమాలపై రవాణా శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం

మహబూబాబాద్ జిల్లా, జనవరి 22 (తీన్మార్ న్యూస్): రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని మహబూబాబాద్ పట్టణంలోని డిఎఫ్ఓ జంక్షన్ స్కూల్ ఆటో డ్రైవర్స్ మరియు విద్యార్థులకు వద్ద రోడ్ సేఫ్టీ భద్రత ట్రాఫిక్ నియమాలు పాటించవలసిన జాగ్రత్తలపై జిల్లా రవాణా శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ పిల్లలు ప్రయాణిస్తున్న ఆటోలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఓవర్ లోడ్ తో ప్రయాణిస్తే కేసులకు గురికావలసి వస్తుందని హెచ్చరించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు, తేదీ జనవరి 1 నుండి 31, వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్కరు



బాధ్యతయూతంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వెంకట్ రెడ్డి అన్నారు.

# మాదకద్రవ్యాల నియంత్రణ పై శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**- నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్**

మహబూబాబాద్ జిల్లా, జనవరి 22 (తీన్మార్ న్యూస్): నెహ్రూ యువ కేంద్ర, వరంగల్, యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 25 కాకతీయ యూనివర్సిటీలో మత్తు మరియు మాదకద్రవ్యాల నియంత్రణ పై 25 మంది యువతకు ఏర్పాటు చేయబోయే రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దరఖాస్తు చేయువారి వారి వయసు 18 నుండి 29 సంవత్సరాల లోపు ఉండాలని, ఎంపికైన అభ్యర్థులకు భోజనము, వసతితో పాటు రవాణా భత్యం కూడా ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఈ నెల 25 మరియు 26 వ తేదీలలో జరిగే ఈ శిక్షణ యువతకు చక్కటి అవకాశం అని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆసక్తిగల యువత హనుమకొండ న్యూ బస్టాండ్ సమీపంలోని నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో తేది.24 -01-2025 మధ్యాహ్నం రెండు గంటల లోపు సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 08702958776 ఫోన్ నంబర్ లో లేదా ఎన్ వై కే కార్యాలయం, బాలసముద్రం హనుమకొండ వద్ద సంప్రదించాలని కోరారు.

# విద్యార్థులు విద్యారంగ సమస్యలపై పోరాడాలి

**- ఏబివిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మంద నరేష్**

**- కెయూలో ఏబిఎస్ఎఫ్ సభ్యత్వం ప్రారంభం**

హనుమకొండ, జనవరి 22 (తీన్మార్ న్యూస్)::కాకతీయ యూనివర్సిటీలో ఏభిఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఏభిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మంద నరేష్ బుధవారం రోజున విద్యార్థులకు ఏభిఎస్ఎఫ్ సభ్యత్వన్ని ఇవ్వడం జరిగింది అనంతరం మంద నరేష్ మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయడానికి ముందుకు రావాలని మంద నరేష్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీ లో అనేక సమస్యలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని కాకతీయ యూనివర్సిటీలో ఉన్న వివిధ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీ అనేకమంది విద్యావేత్తలను, శాస్త్రవేత్తలను, నాయకులను సమాజానికి కాకతీయ యూనివర్సిటీ అందించిందని తెలిపారు. అలాంటి ఘనమైన చరిత్ర కలిగిన కాకతీయ యూనివర్సిటీ నేడు అనేక సమస్యలకు నిలయంగా మారిందని అన్నారు. కేయూ సమస్యలపై ఏభి ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బలమైన ఉద్యమాలు నిర్మిస్తామని మంద నరేష్ అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు విద్యార్థి ఉద్యమాలు చేయాలనీ అంబేద్కర్ పూలే కాన్షిరాం సావిత్రి భాయ్ పూలే ఆశయాలు



సాధించడానికి పోరాటం చేయాలనీ అన్నారు ఏభిఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరిగే పోరాటాల్లో విద్యార్థులు పాల్గొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. యూనివర్సిటీలో వివిధ కోర్సులకు పెంచిన ఫీజులను తగ్గించి విద్యార్థులకు న్యాయం చేయాలనీ యూనివర్సిటీ అధికారులను కోరారు. త్వరలో ఏబీఎస్ఎఫ్ నూతన కమిటీ నీ వెయడం జరుగుతుందనీ మంద నరేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏభిఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ధార సురేష్ కెయూ అధ్యక్షులు దూడపాక నరేందర్ ప్రధాన కార్యదర్శి బండారి పృథ్వీ రాజ్ ఇప్ప భరత్ గౌతమ్ గణేష్ సాయి కుమార్, జిల్లా, కెయూ సభ్యులు, దిలీప్ కిరణ్ వెంకటేష్ పల్లవి వెన్నెల సౌజన్య బిందు నవ్య శ్వేతా లావణ్య తదితరులు పాల్గొన్నారు

# గణతంత్ర దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 22 (తీన్మార్ న్యూస్): గణతంత్ర దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై బుధవారం అన్ని శాఖల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ శాఖల ద్వారా స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు, అధికారులకు ప్రశంసా పత్రాలు అందించడానికి 23వ తేదీ వరకు జాభితా ఇవ్వాలని సూచించారు. వేడుకలకు సంబంధించి ప్రోటోకాల్ పాటిస్తూ అతిధులు కూర్చోడానికి అనువుగా షామియానాలు, కుర్చీలు ఏర్పాటు చేయాలని, స్టేజ్ ఏర్పాట్లు, త్రాగునీటి సరఫరా, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాట్లను సంబంధిత శాఖ అధికారులు అంబేద్కర్ స్టేడియం లో పకడ్బందీగా నిర్వహించాలని, జిల్లా ప్రగతి సందేశమును తయారు చేయాలని, స్టాళ్లను ఏర్పాటు చేయాలని అధకారులను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులతో దేశభక్తి గీతాలపై నృత్య ప్రదర్శనలు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల చే సాంస్కృతిక



కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని డిపిఆర్వో ను, డీఈఓను కలెక్టర్ ఆదేశించారు. వేడుకల సందర్భంగా అంబులెన్సులు, అగ్నిమాపక వాహనం అందుబాటులో ఉంచాలని అన్నారు. మైదానంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రం చేయాలని మున్సిపల్ కమీషనర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డిపిఆర్వో శ్రీనివాస్, డీఈఓ రాజేందర్ మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఖాజా మొయినుద్దీన్, ఇతర శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కేశోరం ఫ్యాక్టరీ కార్మికులకురోడ్డు భద్రత, ట్రాఫిక్ అవగాహన సదస్సు

**- స్వీయ రక్షణ కోసం హెల్మెట్ తప్పనిసరిగా వాడాలి**

**- ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్**

పెద్దపల్లి: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా పెద్దపల్లి ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో వసంత నగర్ కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీ ప్లాంట్ ఆవరణ లో ట్రాఫిక్ రూల్స్, రాష్ డ్రైవింగ్, ట్రీబుల్ రైడింగ్, హెల్మెట్, సీట్ బెల్ట్, వాహన ధ్రువీకరణ పత్రాల ఉపయోగం పై ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ....ప్రతి ఒక్క ఎంప్లాయి విధిగా ఇంటి నుండి బయటకు వెళ్తున్నారంటే హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని డ్యూటీ సమయం కంటే ముందుగానే బయలుదేరాలని, తొందరపాటు తో అతి వేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కావద్దని, ప్రతి ఒక్కరికి స్వీయ రక్షణ ముఖ్యం అని కావున ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి అని సూచించారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి అదేవిధంగా తమ వెహికల్ కి ఇన్సూరెన్స్ తీసుకొని ఉండాలి. మద్యం సేవించి వాహనాలు నడపరాదు మరియు అతివేగంగా అజాగ్రత్తగా సెల్ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదు. ఫోర్ వీల్ వాహనాలు నడిపినప్పుడు అందరూ సీట్ బెల్ట్ ధరించి ఉండాలి. ప్రతి ఒక్కరూ కుటుంబం పట్ల సమాజం పట్ల బాధ్యతగా ఉండి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ డ్రైవింగ్ చేయాలి తద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించాలి. మన నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల కొన్ని కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీ ప్లాంట్ ఇంచార్జి శ్రీనివాస్ రెడ్డి సెక్యూరిటీ ఇంచార్జ్ రవీందర్ రెడ్డి లు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నియంత్రణ పై శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ములుగు జిల్లా, జనవరి 22 (తీన్మార్ న్యూస్): నెహ్రూ యువ కేంద్ర, వరంగల్, యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 25 కాకతీయ యూనివర్సిటీలో మత్తు మరియు మాదకద్రవ్యాల నియంత్రణ పై 25 మంది యువతకు ఏర్పాటు చేయబోయే రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ తెలియజేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దరఖాస్తు చేయాగోరు వారి వయసు 18 నుండి 29 సంవత్సరాలలోపు ఉండాలని, ఎంపికైన అభ్యర్థులకు భోజనము, వసతితో పాటు రవాణా భత్యం కూడా ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఈ నెల 25 మరియు 26 వ తేదీలలో జరిగే ఈ శిక్షణ యువతకు చక్కటి అవకాశం అని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆసక్తిగల యువత హనుమకొండ న్యూ బస్టాండ్ సమీపంలోని నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో 24 -01-2025 లోపు మధ్యాహ్నం రెండు గంటల వరకు సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 08702958776 ఫోన్ నంబర్ లో లేదా ఎన్ వై కే ఆఫీస్ బాలసముద్రం హనుమకొండ వద్ద సంప్రదించాలని కోరారు.

# పార్టీలకతీతంగా అభివృద్ధికి పని చేద్దాం..

**- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**

**- నూతన పీఏసీఎస్ భవన ప్రారంభించిన కేంద్ర మంత్రి,ఎమ్మెల్యే**

**- పీఏసీఎస్ బలోపేతానికి తోడ్పడాలని విజ్ఞప్తి**

**- మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు అందించాలని ప్రభుత్వానికి సూచన**



బెజ్జంకి : కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అభివృద్ధికి..ప్రజా సంక్షేమానికి పార్టీలకతీతంగా జెండాలను, ఎజెండాలను, బేషజాలను పక్కనపెట్టి పని చేద్దామని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, అయా పార్టీల ప్రజాప్రతినిధులకు కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సూచించారు. మండల కేంద్రంలో రూ.3 కోట్ల నాబార్డు నిధులతో పూర్తయిన పీఏసీఎస్ భవనాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్.. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్సీ బాను ప్రసాద్ రావు, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పులి క్రిష్ణ, పీఏసీఎస్ చైర్మన్ తన్నీరు శరత్ రావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్ ఏసీ పంక్షన్ హాల్ ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణలో 30 లక్షల మంది రైతులకు కేంద్ర ప్రభుత్వం ప్రతి యేటా రూ.6 వేలు కిసాన్ సమ్మాన్ నిధులు రైతుల ఖాతాల్లో పెట్టుబడి సహాయంగా జమ చేస్తోందని.. యూరియా కొరత లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటూ ఎరువులపై సుమారు రూ.30 వేల కోట్ల సబ్సిడీని తెలంగాణ రైతులకు అందించిన ఘనత మోదీదేనన్నారు. యూరియా బస్తా మీద రూ. 2,236 లు సబ్సిడీ అందజేస్తుందన్నారు.రామగుండంలో యూరియా పరిశ్రమ ఏర్పాటు చేసి ఎరువుల కొరతలేకుండా.. చెప్పులు లైన్లో పెట్టి రోజుల తరబడి ఎదురుచూసే పనిలేకుండా చేసిన ఘనత మోడీ ప్రభుత్వానిదేనన్నారు. యూరియా బస్తాలు మోసే పనిలేకుండా నానో యూరియా ప్యాకేట్లను అందిస్తోందన్నారు. గత ప్రభుత్వంలో సర్పంచులు గ్రామాల అభివృద్ధికి శాయశక్తుల కృషి చేశారని..అభివృద్ధి పనుల బిల్లులను ప్రభుత్వం వెంటనే అందించాలని సూచించారు. అనంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే కవ్వంపల్లి, ఎమ్మెల్సీ బాను ప్రసాద్ రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దేవిశెట్టి శ్రీనివాస రావును పీఏసీఎస్ చైర్మన్ తన్నీరు శరత్ రావు, డైరెక్టర్లు శాలువ కప్పి శన్మానించి జ్ఞాపికలు అందజేశారు. పీఏసీఎస్, డీసీసీబీ సిబ్బంది, అయా గ్రామాల రైతులు, నాయకులు హాజరయ్యారు.

# గ్రామసభల్లో గడబిడ..

**- తమ పేర్లు రాకపోవడంతో గ్రామ ప్రజలు ఆందోళన ..**

**- ఇంకా ఎన్నిసార్లు ధరకస్తులు తీసుకుంటారని ప్రశ్నలు**

**- పూర్తి స్థాయిలో రేషన్ కార్డులు మంజూరు చేయాలనీ అధికారులకు నిలదీత**



కుబీర్: ప్రభుత్వ పథకాలు లబ్ధిదరుల ఎంపిక కోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామంలో గ్రామసభ లు నిర్వహించాలానే ఉదేశ్యయంతో ప్రభుత్వం మండలంలో అన్ని గ్రామంలో మంగళవారం నుంచి గ్రామ సభలు ఏర్పాటు చేయడం జరిగింది. దింతో రెండో రోజున బుధువారం మండలంలోని పార్డి (బి) గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ సభ సమావేశానికి గ్రామ ప్రత్యేక అధికారి మరియు వ్యవసాయ విస్తీరణ అధికారులు అంగన్వాడీ కార్యకర్తలు పీల్డ్ ఆసటెంట్లు మిగితా శాఖలకు చెందిన అధికారులు హాజరై సమావేశం ప్రారంభించారు. దింతో ఆయా శాఖలకు చెందిన అధికారులు రేషన్ కార్డులు. ఇందిరమ్మ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, జాబితాలో రాని పేర్లు ఉండడంతో ప్రజలు ఒక్కసారిగా అధికారులపై విరుచుకు పడ్డారు. దింతో గ్రామ నాయకులు కొందరు గ్రామ సభ లో రేషన్ కార్డు లు పూర్తి స్థాయిలో మంజూరు చేస్తే నీ గ్రామ సభ నిర్వహించాలనని గ్రామస్తులు అధికారులకు తేల్చి చెప్పారు. లేదంటే మీ ఉన్నాత స్థాయి అధికారులైన తహసీల్దార్, ఆర్ డి ఓ కు ఎక్కడికి రప్పించాలనని డిమాండ్ చేశారు. అనంతరం రెవెన్యూ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ రేషన్ కార్డులు లేని ప్రతి ఒక్కరికి దగ్గర ఉండి చేపిస్తానని చెప్పడం తో గ్రామస్తులు ఆందోళన విరమించారు.. రైతు భరోసా, ఇందిరమ్మ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ధరకస్తూ చేసుకొని వారికి ఇప్పుడు ధరకస్తులు చేసుకోవాలని అన్నారు. దింతో ప్రత్యేక అధికారి మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రతి ఒక్క కుటుంబానికి ప్రభుత్వం విడుదల చేసిన ఆరు పథకాలను ప్రజలకు అందేలా చూస్తామని అన్నారు. దింతో దరఖాస్తు లు చేసుకున్న వారికి పథకాలు అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఇప్పటికే ఎన్నో సార్లు దర్కస్తులు ఇవ్వడం జరిగిందని అధికారుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేసారు.గతంలో మీ సేవలో రేషన్ కార్డు కొరకు దర్కస్తులు చేసుకున్న కుటుంబాలకు ఇప్పటి వరకు వారి పేర్లు రేషన్ కార్డులో రావడం లేదని మండిపడ్డారు ఇప్పటికైనా ధరకస్తులు చేసుకున్న లబ్దిదారులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శ భూమేష్ వ్యవసయా విస్తీరణ అధికారి అశ్విని రెవెన్యూ అధికారి నిర్మల గ్రామస్తులు వడ్ల రాజన్న తూము రాజేశ్వర్ కానోబా ప్రవీణ్ శ్రీకాంత్ శేరి సురేష్ బాబు లబ్ది దారులు ఆయా శాఖలకు చెందిన అధికారులు తదితరులు ఉన్నారు.

# 71 శాతం నీటివాటా ఇవ్వాలి

**- కేటీఆర్ఎంబీలో తెలంగాణ డిమాండ్**

**- ఏడాది సర్దుబాటును కొనసాగించొద్దు :రాహుల్‌బొజ్జా**

**- 50:50 నిష్పత్తిని అంగీకరించం : ఏపీ**

**- నీటివాటాలపై ఇరు రాష్ట్రాల పట్టు**

**- బోర్డు నిర్వహణపైనా చర్చ**



హైదరాబాద్: కృష్ణా జలాల్లో తెలంగాణకు 71 శాతం వాటాను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేసింది. ఇప్పటిదాకా ఇస్తున్న 66:34 శాతం నిష్పత్తిని వ్యతిరేకించింది. రాష్ట్రంలో కృష్ణా పరివాహక ప్రాంతం 71 శాతం ఉంది. ఇది ఖరారు చేసేవరకు చెరిసగం వాటా ఇవ్వాలని కోరింది. కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) సమావేశం చైర్మెన్ అతుల్‌జైన్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగింది. తెలంగాణ నుంచి నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ అనిల్‌కుమార్, ఏపీ ఈఎన్సీ వెంకటేశ్వర్‌రావు, ఇంజినీర్లు, ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. రెండు రాష్ట్రాలకు కృష్ణా జలాల విడుదల , ఇప్పటివరకు వినియోగం, జలాశయాల్లో నిల్వలు, కృష్ణా పరివాహకంలో టెలిమెట్రీ పరికరాల ఏర్పాటు, శ్రీశైలం జలాశయాల ఆనకట్టల మరమ్మతులు, బోర్డుకు నిధుల కేటాయింపు, రెండు రాష్ట్రాలు నిర్మిస్తున్న ప్రాజెక్టులపై పరస్పర ఫిర్యాదులు తదితరాలపై చర్చ జరిగింది. భేటీ అనంతరం తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా జలసౌధలో మీడియాతో మాట్లాడుతూ కృష్ణాజలాల్లో 66:34 నిష్పత్తిపై నిరసన తెలిపారు. జలాల మళ్లింపు విషయమై కూడా సమావేశంలో ప్రస్తావించినట్టు రాహుల్ బొజ్జా తెలిపారు. 11 ప్రాంతాల్లో గతంలో బోర్డు సూచించిన మేరకు టెలిమెట్రీ ఏర్పాటు చేయాలని కోరాం.ఒక సంవత్సరం కోసం ఏర్పాటు చేసుకున్న సర్దుబాటును ఇంకా కొనసాగించడం న్యాయం కాదని చెప్పినట్టు వివరించారు. ఈ విషయమై త్వరలో స్పందిస్తామని ఏపీ ఈఎన్సీ చెప్పినట్టు చెప్పారు. ఇందుకు కేఆర్ఎంబీ చైర్మెన్ అతుల్‌జైన్ స్పందిస్తూ ప్రస్తుతం 66:34 నిష్పత్తి ప్రకారం కొనసాగిస్తామని చెప్పారు. పరిస్థితులను బట్టి వాటా పెంచే ప్రయత్నం చేస్తామని వివరించారు. తెలంగాణ ఈఎన్సీ అనిల్‌కుమార్ మాట్లాడుతూ నాగార్జునసాగర్ నుంచి సీఆర్పీఎఫ్ బలగాలను ఉపసంహరించుకోవాలని కోరామని చెప్పారు. ఇందుకు కేఆర్ఎంబీ రెండు నెలల సమయం కోరిందని వివరించారు. తెలంగాణ నదీ జలాల వాటా పెంచేందుకు చైర్మెన్ ఒప్పుకున్నట్టు తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతుల అంశాన్ని సైతం ప్రస్తావించామన్నారు. డ్యామ్ స్లూయిజ్‌కు మరమ్మతులు చేయిస్తామని బోర్డు చైర్మెన్ చెప్పినట్టు తెలిపారు.

# అపరిచితుల వ్యక్తుల మాటలు నమ్మవద్దు

**నమ్మి మోసపోయి జీవితాన్ని కోల్పోవద్దు**

**సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి**

సిద్దిపేట: విద్యానికేతన్ హై స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, షీటీమ్ నిర్వహిస్తున్న విధుల గురించి, షీటీమ్ ద్వారా ఎలా రక్షణ పొందొచ్చు అనే అంశాల గురించి, ర్యాగింగ్/ ఇవిటీజింగ్/ పోక్సో/ షీ టీమ్స్/ యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు,నూతన చట్టాల గురించి, మరియు అపరిచిత వ్యక్తుల యొక్క ఫోన్ కాల్స్ మరియు మాటలు నమ్మవద్దు, సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుందిమహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం మహిళల భద్రత మా ముఖ్య బాధ్యత. చదువుకునే సమయములో చెడు అలవాట్లకు బానిస కావొద్దు అన్నారు, ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించాలని తెలిపారు, డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. చదువుకోవడం వలన భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని అన్నారు. పిల్లలను చదివించటానికి తల్లిదండ్రులు చేస్తున్న కష్టాన్ని మనసులో పెట్టుకొని చదువుపై శ్రద్ధ వహించాలని మరియు సామాజిక రుగ్మతల గురించి సెల్ఫోన్ కు ఎంత దూరం ఉంటే అంత మంచిది సెల్ ఫోన్ వల్ల ఎంత మంచి ఉందో అంత చెడు ఉంది దానికి అలవాటు పడి బానిసలు కావద్దు విద్యార్థి దశ చాలా కీలక కష్టపడే తత్వం కష్టపడి చదువుకోవడం చాలా ముఖ్యమని మహిళలను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మరియు అవహేళనగా మాట్లాడిన వెంటనే డయల్ 100 లేదా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ షీటీమ్ నెంబర్ 8712667434 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సమాచార అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. మరియు నూతన చట్టాల గురించి నూతన చట్టాలలో మహిళల రక్షణకు పెద్దపీట వేయడం జరిగిందని అవగాహన కల్పించిన సిద్దిపేట షీటీమ్ ఏఎస్ఐ కిషన్, మహిళా కానిస్టేబుల్ మమత, కానిస్టేబుల్ ప్రవీణ్ ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ గోపి, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజ్యాంగం అత్యంత పవిత్రమైనది: కర్ర శ్రీనివాస్ రెడ్డి

పెద్దవంగర: భారత రాజ్యాంగ అత్యంత పవిత్రమైనదని, సర్వోన్నతమైనదని బీజేపీ రాష్ట్ర నాయకులు కర్ర శ్రీనివాస్ రెడ్డి, మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని సాయి గార్డెన్ లో మండల అధ్యక్షుడు బొమ్మెరబోయిన సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం సంవిధన్ గౌరవ అభియాన్ కార్యశాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 26 నవంబర్ 2015న తొలిసారి రాజ్యాంగ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించిందని అప్పటి నుండి ప్రతి సంవత్సరం రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటూ మనం రాజ్యాంగాన్ని గౌరవించుకుంటున్నామన్నారు. దేశంలోని ప్రతి పౌ రుడికి రాజ్యాంగం అత్యంత పవిత్రమైనదని సర్వోన్నతమైనదని తెలిపారు. గత నెల లో భారత రాజ్యాంగం 75వ వార్షికోత్సవంపై పార్లమెంట్ ఉభయ సభల్లో సమగ్ర చర్చ జరిగిందని, ప్రధాని మోదీ నాయకత్వంలో రాజ్యాంగ



నిర్మాత డాక్టర్ బాబాసా హెబ్ అంబేద్కర్ గౌరవార్థం పంచతీర్థాల అభివృద్ధితోపాటు పేదలు, అణగారిన వర్గా ల సంక్షేమంకోసం అనేక పథకాలను లను అమలుపరుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బొచ్చు సురేష్ యాదవ్, తొర్రూర్ రూరల్ అధ్యక్షుడు గట్టు రాంబాబు, ఎస్సీ మోర్చా మండల నాయకుడు జలగం ఆనంద్, ఎస్టీ మోర్చా జాటోత్ శంకర్, బొట్టు మంచి శ్యామ్, దేశెట్టి వెంకటనారాయణ, కోట కుమార్, రాంపల్లి హరీష్, పగిడిపల రాజు, రాపోలు అన్వేష్, గజ్జి పవన్ తదితరులు పాల్గొన్నారు.

# పాలకుల్లో కదలిక తెస్తున్న పోరాటాలు

**- శ్రమదోపిడీకి వ్యతిరేకంగా అవిశ్రాంత ఉద్యమాలు**

**- వైద్యారోగ్యశాఖలో ఉద్యోగుల హక్కుల సాధన కోసం నిలబడ్డా : తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్**




హైదరాబాద్: పాలకులు మారినా ప్రభుత్వ విధానాలు మారటం లేదు. ఫలితంగా వైద్యారోగ్య రంగం ప్రయివేటీకరణ, కాంట్రాక్టీకరణ విధానాల మూలంగా మొత్తం అనారోగ్య రంగంగా మారుతున్నది. గత 29 సంవత్సరాలుగా పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు రెగ్యులర్ కాకపోవడం, కనీసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టబద్ధంగా కల్పించిన కనీస వేతనాలు, సమాన పనికి సమాన వేతనం, ఇతర హక్కులు కూడా అమలు కాకుండా దశాబ్దాల తరబడి ఉద్యోగులు, వారి కుటుంబాలు దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారు.గత 3 సంవత్సరాలుగా వైద్యారోగ్య రంగాన్ని బలోపేతం చేయాలనీ, ప్రజలందరికి నాణ్యమైన ఉచిత వైద్యం అందించాలనీ, ఈ రంగంలో పని చేస్తున్న మొత్తం రెగ్యులర్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో దశల వారి ఆందోళన పోరాటాలు, నిరవధిక సమ్మెలు చేసి ప్రభుత్వాల్లో కదలిక తెప్పించి కొన్ని విజయాలు సాధించడం జరిగింది. ప్రధానంగా కాంట్రాక్ట్ ఉద్యోగులకు సంబంధించి అన్ని క్యాడర్ల ఉద్యోగులను సమీకరించి కనీస వేతనాలు, రెగ్యులరైజేషన్ కోసం 2023 ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 2వ తేదీ వరకు నిరవధిక సమ్మె చేయడంతో ప్రభుత్వంలో కదలిక వచ్చింది. సర్వీసు వెయిటేజీని 20 మార్కుల నుంచి 30 మార్కులకు పెంచింది. ఇందులో యూనియన్ విజయాన్ని సాధించింది. దీని ఫలితంగా కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు చాలా లాభం జరిగిందనే అభిప్రాయంతో వారు యూనియన్తో మమేకమై పని చేస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగుల సమస్యలైన సాధారణ బదిలీల్లో ఎవరికి అన్యాయం జరగకూడదని 2024లో ఉద్యోగుల తరపున యూనియన్ చేసిన కృషి మరువలేనిది. వైద్యారోగ్య రంగంలోని ఎన్ఆర్ఎంహెచ్, 104, 108, ఆరోగ్యశ్రీ, అర్బన్ హెల్త్ సెంటర్లు, ఆయుష్, ఆర్ఎన్టీపీసీ, వైద్య విధాన పరిషత్, మెడికల్ ఎడ్యుకేషన్, పబ్లిక్ హెల్త్, ప్రివెంటివ్ మెడిసిన్, ఇతర అన్ని విభాగాల్లోని మొత్తం విభాగాల్లోని ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించింది.ఒకరకంగా చెప్పాలంటే రెగ్యులర్గా పోరాటాలు చేస్తూ విజయాలు సాధిస్తూ యూనియన్ ముందుకెళ్తున్నది.

# విమర్శలు మాని హామీలు నెరవేర్చండి..

**- మీడియా సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు**



బాల్కొండ : డీసీసీ కాంగ్రెస్ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి మాజి మంత్రి ,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని బేషరతుగా క్షమాపణలు చెప్పాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శలు మాని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలిపారు. కల్యాణ లక్ష్మీ, షాది ముబారక్ పథకాలు ప్రారంభించింది మా కేసీఆర్ బిఆర్ఎస్ ప్రభుత్వం అని, గత 10 ఏండ్ల కాలంలో లక్షలాది పేదింటి అడబిడ్డలకు కేసీఆర్ ఒక మేనమామ లాగా లక్ష రూపాయలు చెక్ లు అందజేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు దాటింది అధికారంలోకి వచ్చిన మొదటి తొమ్మిది నెలల్లో ఒక్క కళ్యాణ లక్ష్మీ షాది ముబారక్ చెక్ కూడా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పంచలేదని తెలిపారు. మొన్నటి ఎన్నికల్లో ఈ నెల అయితే లక్ష వచ్చే నెల అయితే లక్షతో పాటు తులం బంగారం అని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇప్పటి వరకు ఇచ్చిన తులం బంగారం హామీ నెరవేర్చలేదు. అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంగా ఇచ్చిన హామీ నెరవర్చటం లేదు అని అనేక వేదికల ద్వారా మా ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి చెక్ లు అందుకున్న లబ్దిదారుల పక్షాన ప్రశిస్తూనే ఉన్నారు. తులం బంగారం హామీని ఈ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నెరవేర్చడం లేదు అని తన నిరసనను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాడనికి ఈ దఫా చెక్ లను ఎమ్మెల్యే బహిష్కరించారు. కానీ ఏక్కడ చెక్ ల పంపిణీ అపమని చెప్పలేదు. చెక్ లు పంపిణీ చేయమని అధికారులను అదేశిస్తూనే ఉన్నారు. మీరు అధికారాం లోకి వచ్చి 6 గ్యారంటీలు,13 హామీలు 420 వాగ్దానాలు ఇచ్చారు. రూ.2500 మహాలక్ష్మి, రూ.4000 పెన్షన్, 2 లక్షల జాబ్ లు, రైతు భరోసా, విద్యార్థులకు 5 లక్షల కార్డు జాబ్ క్యాలెండర్, ల్యాప్ టాప్ లు, స్కూటీలు ఇలా అనేక హామీలు ఇచ్చి నెరవర్చటం లేదు. ఇకనైనా మానాల మొహన్ రెడ్డి మా ఎమ్మెల్యే పై అనవసర ఆరోపణలు మాని ఇచ్చిన హామీలు నెరవేర్చండి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బద్దం ప్రవీణ్ రెడ్డి, లింగా గౌడ్, దాసరి వెంకటేష్, బద్దం నర్సారెడ్డి, సామా వెంకట్ రెడ్డి, జోగు నరసయ్య, శ్రీకాంత్ యాదవ్, కన్న పోశెట్టి, సాగర్ యాదవ్, ఇష్తేఖరుద్దిన్, మానేటి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి భరోసా కరువు

**- తగ్గుతున్న పనిదినాలు..వేతనాలూ అంతంతే**

**- ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం**

**- ఆహారభద్రతా చట్టాన్ని తుంగలో తొక్కుతున్న మోడీ సర్కారు**

**- కేరళ తరహాలో వ్యవసాయ కూలీలకు మేలు చేయాలని పోరాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం**

**- ప్రజాపంపిణీలో 14 సరుకులిస్తున్న సీపీఐ(ఎం) నేతృత్వంలోని వామపక్ష ప్రభుత్వం**




హైదరాబాద్: వామపక్షాల పోరాటం, ఒత్తిడితో వచ్చిందే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం. అది వచ్చాక కనీసం వంద రోజుల పని గ్యారెంటీతో పేదోళ్ల ఆకలి బాధలు తగ్గాయి. కొంతలో కొంత ఆర్థిక వెసులుబాటూ కలిగింది. వేతనాల కోసం డిమాండ్ చేసే పరిస్థితీ వచ్చింది. కూలోడు అణిగిమనిగి ఉండాలిగానీ బేరసారాలాడటమేంటి? తలెత్తుకుని మాట్లాడమేంటి? అని అనుకున్నారో ఏమోగానీ కేంద్ర పాలకులు ఉపాధి హామీ చట్టాన్ని క్రమంగా నిర్వీర్యం చేస్తూ పోతున్నారు. మోడీ పాలనలో వంద రోజుల పని గ్యారెంటీ ఏమోగానీ కుటుంబానికి సగం రోజుల పని కూడా దక్కని పరిస్థితి. ఈ నేపథ్యంలోనే వ్యవసాయ కార్మికులు, కూలీల హక్కుల కోసం తెలంగాణలో వ్యవసాయ కార్మిక సంఘం నికరంగా పోరాటం చేస్తున్నది. మరోవైపు కేరళ ప్రభుత్వం మాత్రం కేంద్రానికి భిన్నంగా ఆలోచిస్తూ కూలోళ్ల పక్షపాతిగా నిలుస్తున్నది.

కేంద్ర ప్రభుత్వం ఆహారభద్రతా చట్టాన్ని, ప్రజాపంపిణీ వ్యవస్థను తుంగలో తొక్కుతుంటే.. ప్రజాపంపిణీ ద్వారా పేదోళ్లకు అండగా ఉంటున్నది. రోజుకు రూ.700 కూలి అందేలా చూస్తూ ఆదర్శంగా నిలుస్తున్నది.

# ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులో మాజీ కార్పొరేటర్ విశాలినిరెడ్డి పేరు..

**- ఇటుకల గోడ రేకుల కప్పు ఉందని ఇళ్ళు సాంక్షన్**

**- అధికారులను నిలదీసిన స్థానిక ప్రజలు**

**- సర్వే తప్పుల తడక**



కంఠేశ్వర్ : నిజామాబాద్ నగరంలోని 43వ డివిజన్ ప్రజాపాలనలో భాగంగా జరుగుతున్న వార్డు సభ రచ్చరచ్చ అయింది.ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం తర్వాత అర్హులైన వారికి రైతుభరోసా కొత్త రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్ళు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల లబ్దిదారుల ఎంపిక కోసం వార్డు సభలు నిర్వహిస్తున్న విషయం తెల్సిందే. నగరంలోని పాత అంబేద్కర్ భవన్ లో జరిగిన 23వ డివిజన్ వార్డు సభలో ప్రజలు అధికారులను నిలదీశారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటి జాబితాలో స్థానిక మాజీ డివిజన్ కార్పొరేటర్ విశాలినిరెడ్డి పేరును 106 సీరియల్ నంబర్ లో పేర్కొనడం పట్ల ప్రజలు మండిపడ్డారు. ఇది వరకు రెండుసార్లు కార్పొరేటర్ గా, గతంలో కార్పొరేటర్ గా పోటీ చేసి ఓడిపోయారు. ఆమె భర్త చామకూర ప్రభాకర్ రెడ్డి కొన్ని నెలల క్రితం వరకు నూడా చైర్మన్ గా పని చేశారు. వారిని ఇందిరమ్మ ఇండ్లకు లబ్దిదారుగా చేర్చడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారిని ఏ విధంగా అర్హులుగా చేస్తారని మండిపడ్డారు. ఇండ్లు లేని పేదలు ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేస్తే వారి జాబితా లేదని, తప్పులు ఉన్నాయని సర్వేలు చెబుతున్న అధికారులు ధనికులకు, రాజకీయ నాయకులకు, సొంత భవనాలు కలిగిన వారికి, వ్యాపారం చేసే వారికి అర్హుల జాబితాలో ఎలా చేరుస్తారని అధికారులను నిలదీశారు. విషయం తెలిసిన స్థానిక కార్పొరేటర్, ఇందిరమ్మ ఇళ్ళ కమిటీ డివిజన్ చైర్మన్ స్రవంతిరెడ్డి అక్కడికి చేరుకుని అధికారుల తీరుపై మండిపడ్డారు. అధికారులు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు చెత్తబుట్టపాలు చేశారని మండిపడ్డారు. అనర్హులను ఏ విధంగా జాబితాలో చేర్చారని సర్వే అంతా బూటకమని అన్నారు. సర్వే అంతా కాంగ్రెస్ నాయకుల కనుసన్నుల్లో జరిగిందని, అర్హులను వదిలేసి కాంగ్రెస్ కార్యకర్తలకు, వారి సానుభూతిపరులకే ఇచ్చారనడానికి మాజీ కార్పొరేటర్ పేరు జాబితాలో ఉండడమే నిదర్శనమన్నారు. తక్షణం అధికారులు అర్హుల జాబితాను పున:పరిశీలన చేయాలని డిమాండ్ చేశారు.

# సామాజిక మాధ్యమాల్లో జాగ్రత్తలు తప్పనిసరి..

**- విద్యార్థుల అవగాహన సదస్సులో ఏఎస్ఐ శంకర్ రావు**



బెజ్జంకి: ఆదునిక సాంకేతిక పరిజ్ఞానం వల్ల ప్రయోజనాలతో పాటు నిష్ప్రయోజనాలున్నాయని.. సామాజిక మాధ్యమాల వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని ఏఎస్ఐ శంకర్ రావు విద్యార్థులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని గీతా పాఠశాల విద్యార్థులకు షీ టీం అధ్వర్యంలో మొబైల్ ఫోన్,సామాజిక మాధ్యమాల వినియోగం, మత్తుపదార్థాల వల్ల సంభవించే అనర్థాలు, రోడ్డు భద్రత నియమాలు, మైనర్ డ్రైవింగ్, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. షీ టీం బృందం, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ వయసు పెంచే ఆలోచన విరమించుకోవాలి..

భీంగల్ రూరల్: మండలంలోని బెజ్జోర, ముచ్కూర్, పీప్రీ, బాచన్ పల్లి, పల్లికొండ తదితర పాఠశాలల్లో గోడ క్యాలెండరు, టేబుల్ క్యాలెండర్ లను ఆవిష్కరించిన సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయస్సు 61 సంవత్సరాల నుండి 63 సంవత్సరాలు పెంపు విషయంపై ప్రభుత్వా నికి ఆలోచన ఉంటే వెంటనే విరమించుకో వాలనీ డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ భీంగల్ శాఖ అధ్యక్షులు జాన్ విల్సన్ కోరారు. ఈ విషయంపై గత కొన్ని రోజులలో వివిధ పత్రికలలో, టీవీ మాధ్యమా లలో, సోషల్ మీడియా లలో పుంఖాను పుంకాలుగా వార్తలు వస్తున్నాయని వారు పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 58 నుండి 61 సంవత్సరాలకు పెంచడం ద్వారానే అనేకమంది నిరుద్యోగులకు అన్యాయం జరిగింది వేలాది మంది ఉపాధ్యాయులకు ప్రమోషన్ అవకాశాలు దెబ్బ తిన్నాయని ,వయసు రీత్యా ఉద్యోగులకు అనారోగ్య సమస్యలు ,పనిలో మందకొడితనం లాంటి అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి అన్నారు. ఇలాంటి సమస్యలను సరిదిద్దాల్సింది పోయి మళ్ళీ ఉద్యోగ విరమణ వయసు పెంపు సరికాదన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఇవ్వాల్సిన వివిధ చెల్లింపుల భారం తగ్గించుకోవడం తదితర కారణాలతో




ఈ నిర్ణయం తీసుకుంటే ఇది భవిష్యత్ తరాలకు గొడ్డలి పెట్టని విల్సన్ అభిప్రాయపడ్డారు. అదేవిధంగా పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి అన్నారు. అనంతరం భీంగల్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి గట్టు ఈశ్వర్ మాట్లాడుతూ నాలుగు విడతల పెండింగ్లో ఉన్న డి ఏ లు విడుదల చేయాలని, రెండు సంవత్సరాల క్రితం వేసిన పిఆర్సి కమిటీ రిపోర్ట్ తెప్పించి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కాలయాపన చేయకుండా తక్షణమే పిఆర్సి అమలు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హఫీజ్, రమేష్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎంపీడీవో కార్యాలయం ముందు గిజనుల నిరసన..



జన్నారం: జన్నారం మండలంలోని కామన్ పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని నాయకపు గుడా గిరిజనులు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఆ గూడెంలో దాదాపు 20 కుటుంబాలు ఉంటాయని ప్రస్తుతం జరుగుతున్న ప్రజాపాలన గ్రామసభలకు తలకు ఎలాంటి సమాచారం లేదన్నారు. ఆ గూడెంలో ఒకరికి కూడా ఇందిరమ్మ ఇల్లు గాని రేషన్ కార్డులు గానీ ఏ ఇతర ప్రభుత్వ పథకాల జాబితాలో తమ పేర్లు లేవన్నారు. అధికారులను అడిగితే నిర్లక్ష్యపు సమాధానాలురిస్తున్నారని వారన్నారు. వెంటనే తమ గూడెం గిరిజనులను ప్రభుత్వం అధికారులు దృష్టిలో ఉంచుకొని తమకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేయాలని వారు కోరారు కార్యక్రమంలో గంగన్న పోషణ నాయక కూడా గ్రామ గిరిజన మహిళలు పాల్గొన్నారు.

# కిడ్నీ రాకెట్ వ్యవహారంపై ప్రభుత్వ ప్రత్యేక కమిటీ




హైదరాబాద్: అలకనంద ఆసుపత్రి కిడ్నీ రాకెట్ వ్యవహారంలో నిజానిజాలు తేల్చేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించింది. ఉస్మానియా మాజీ సూపరింటెండెంట్ నాగేందర్ ఆధ్వర్యంలో ఈ కమిటీని ఏర్పాటు చేసింది. దీంతో అలకనంద ఆసుపత్రిని నాగేందర్ బృందం పరిశీలించింది. కిడ్నీ శస్త్రచికిత్సలపై విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని నాగేందర్ తెలిపారు. అసలేం జరిగిందంటే సరూర్‌నగర్‌లోని అలకనంద ఆసుపత్రిలో అనుమతి లేకుండా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు జరుగుతున్నాయనే సమాచారంతో మంగళవారం రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు, పోలీసులు దాడులు చేశారు. తనిఖీల్లో భాగంగా కిడ్నీ మార్పిడి కోసం ఇద్దరు దాతలు, ఇద్దరు గ్రహీతలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఆ నలుగుర్నీ గాంధీ ఆసుపత్రికి తరలించారు. సరూర్‌నగర్ డాక్టర్స్ కాలనీలో ఆరునెలల క్రితమే ఈ ఆసుపత్రి ప్రారంభమైంది. జ్వరం, ఇతర చిన్న చికిత్సలు చేయడానికి మాత్రమే ఆసుపత్రికి అనుమతి ఉంది. కానీ అనధికారికంగా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు చేయిస్తున్నట్టు సమాచారం అందడంతో వైద్యాధికారులు గీత, అర్చన, ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, సరూర్‌నగర్ సీఐ సైదిరెడ్డి మంగళవారం ఆసుపత్రిలో తనిఖీలు చేశారు. ఆ సమయంలో నలుగురు చికిత్స తీసుకుంటూ కనిపించారు. వారి శరీరాన్ని పరిశీలించగా వీపు కింద భాగంలో పెద్ద శస్త్ర చికిత్స జరిగినట్టు గుర్తించారు. కిడ్నీ మార్పిడికి చేయించినట్టు ప్రాథమికంగా నిర్ధరించుకున్నారు. మరింత స్పష్టత కోసం వారిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిని సీజ్ చేస్తున్నట్టు డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు ప్రకటించారు. సరూర్‌నగర్ పోలీస్ స్టేసన్ లో కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై స్పందించిన ప్రభుత్వం నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసింది.

# కార్మికుల, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

**– సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్**

**– ఈపీఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా**




అంబర్‌పేట: దీర్ఘకాలికంగా, అపరిష్కృతంగా ఉన్న కార్మికుల, పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ బర్కత్‌పురాలోని ఈపీఎఫ్ కార్యాలయం వద్ద సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ అధ్యక్షతన కార్మికులు, ఉద్యోగులు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. పీఎఫ్, అనుబంధ స్కీంల అమలులో వస్తున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల కెవైసీ సత్వరమే పూర్తి చేసి సహకరించాలని, అనవసర కారణాలతో తిరస్కరించొద్దని అన్నారు. పెన్షన్‌బుల్ సాలరీ సీలింగ్‌ను రూ.26వేలకు పెంచాలని, హయ్యర్ పెన్షన్ విషయంలో సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని కోరారు. కోర్టు తీర్పు ప్రకారం.. జాయింట్ డిక్లరేషన్ ఇచ్చిన వారికి తక్షణమే డిమాండ్ నోటీసులు జారీ చేయాలన్నారు. డిమాండ్ నోటీసులకు డబ్బులు చెల్లించిన వారికి తక్షణమే సవరించిన పెన్షన్‌ను చెల్లించాలన్నారు. సవరించిన పెన్షన్ చెల్లిస్తున్న వారికి రావాల్సిన ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలని, హయ్యర్ పెన్షన్ చెల్లింపులో దామాషా పద్ధతి కాకుండా చట్టప్రకారం పూర్తి పెన్షన్ చెల్లించాలని కోరారు. కనీస పెన్షన్ రూ.9వేలకు పెంచాలని కోరారు. ఈపీఎఫ్ పెన్షన్‌కు కరువు భత్యం, వేతన ఒప్పందాలను లింక్ చేయాలన్నారు. ధర్నా అనంతరం సీఐటీయూ ప్రతినిధి బృందం రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ (పెన్షన్)ను కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేసింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వీఎస్‌రావు, కార్యదర్శి జె.వెంకటేష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కుమారస్వామి, పెన్షనర్స్ నాయకులు మాదాని బ్రహ్మాచారి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానం ప్రస్తావన ప్రత్యేకం

**– సదస్సు నిర్వహణ విప్లవాత్మక నిర్ణయం : ప్రొ.హరగోపాల్**

**– సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సదస్సు పోస్టర్ ఆవిష్కరణ**



బంజారాహిల్స్: యాభై ఏండ్ల విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానంపై సదస్సు నిర్వహించడం విప్లవాత్మక నిర్ణయమని, చారిత్రాత్మక అవసరమని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఫిబ్రవరి 20, 21 తేదీల్లో బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న "50 ఏండ్ల విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానం" పోస్టర్‌ను హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పలువురు నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలకు సంబంధించిన ప్రత్యేకత ఏమైనా ఉందంటే.. అది విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్తావమేనన్నారు. నాటి విద్యార్థి సంఘటిత పోరాటాలతో పోలిస్తే నేటి విద్యార్థి సంఘటిత పోరాటాలు చాలా బలహీనంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ ప్రజా పోరాటాల్లో విద్యార్థులు కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. కానీ వారి పోరాట లక్ష్యాలను ప్రత్యేక రాష్ట్రంలో పదేండ్ల కాలంలో ప్రభుత్వాలు నెరవేర్చలేకపోయాయని అన్నారు. కనీసం విద్యార్థుల పరీక్షలను సైతం సజావుగా నిర్వహించలేదని విమర్శించారు. పదేండ్లలో కొలువులు ఒకే కుటుంబానికి పరిమితమయ్యాయని, ఇది విషాదకరమైనదని ఆవేదన వ్యక్తం చేశారు. నాటి విద్యార్థుల ఉద్యమాలు జ్ఞాపకాలు అని, నేటి విద్యార్థులకు వాటి గురించి అవి తెలియపరిచేందుకు చక్కటి వేదికగా ఈ సదస్సు ఉంటుందని తెలిపారు. నాటి విద్యార్థులు చేసిన పోరాటాల సందర్భం, సంఘటనలు తెలుసుకోవడానికి సుందరయ్య విజ్ఞాన కేంద్రం చక్కని వేదిక అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, పద్మ అరుణ డాక్టర్ గోపీనాథ్ సాంబమూర్తి శివారెడ్డి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డులు.. ఇందిరమ్మ ఇండ్లు నిరంతర ప్రక్రియ

**– దరఖాస్తు చేసుకోనివారు ఇప్పటికైనా చేసుకోండి : వీడియో కాన్ఫరెన్సులో డిప్యూటీ సీఎం, మంత్రులు**



హైదరాబాద్: రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు అనేవి నిరంతర ప్రక్రియలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు స్పష్టం చేశారు. వాటి కోసం దరఖాస్తు చేసుకోనివారు ఇప్పటికైనా అప్లికేషన్లు సమర్పించాలని సూచించారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించిన సంగతి విదితమే. శుక్రవారం వరకూ కొనసాగనున్న ఈ కార్యక్రమంపై హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఈ కార్యక్రమంలో పాల్గొని, జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలుకు దాదాపు రూ.40 వేల కోట్లు అవసరమవుతాయని వివరించారు. రాష్ట్రంలో దాదాపు పదేండ్ల తర్వాత రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్న క్రమంలో ఈ రెండు పథకాలకు అత్యధికంగా దరఖాస్తులు వస్తున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇప్పటికే దరఖాస్తు సమర్పించినవారిలో ఇల్లు లేని వారు, ఇళ్ల స్థలం ఉండి ఇల్లు లేని వారు తమ తమ పేర్లను గ్రామ సభల్లో తెలపాలని సూచించారు. దరఖాస్తు చేసుకోని వారికి ఈనెల 24 వరకు అవకాశం కల్పిస్తున్నట్టు ప్రకటించారు. రేషన్ కార్డుల జారీకి సంబంధించి అర్హులైన వారి జాబితాను ఇప్పటివరకు ప్రకటిం చలేదని స్పష్టం చేశారు. దరఖాస్తులన్నింటినీ క్షుణ్నంగా పరిశీలించిన తర్వాత అర్హులైన వారిని ప్రకటిస్తామని వెల్లడించారు. మంగళవారం నాటి గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించిన కలెక్టర్లను వారు ఈ సందర్భంగా అభినందించారు. ఆ నాలుగు పథకాలకు సంబంధించి స్వీకరించే దరఖాస్తుల్లో తప్పనిసరిగా దరఖాస్తుదారుల పేరు, ఆధార్ కార్డు నెంబర్, చిరునామా, ఇంటి అడ్రస్ తదితర వివరాలను తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాగా, మంగళవారం రాష్ట్రంలోని 4,098 గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించినట్టు సీఎస్ వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సంబంధిత శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.


# కాళేశ్వరం లక్ష్యమేంటి ?

**– ప్రాజెక్టును తొందరగానే కట్టారు.. నిబంధనలు పాటించలేదు**

**– ఆదాయం ఎలా వస్తుంది ?**

**– ఆర్థిక శాఖ స్పెషల్ సీఎస్ రామకృష్ణారావుపై న్యాయ కమిషన్ ప్రశ్నల వర్షం**

**– అప్పులు, డిజైన్లు, బడ్జెట్ చుట్టే విచారణ**



హైదరాబాద్: కాళేశ్వరం లక్ష్యం ఏంటి? ఆదాయం ఎలా సమకూర్చుకుంటారు? ప్రాజెక్టును తొందరగానే కట్టినా మార్గదర్శకాలను పాటించలేదు.. ఎందుకని ? నిధుల కేటాయింపునకు క్యాబినెట్ ఆమోదం ఉందా ? అప్పులు ఎలా తెచ్చారు ? వడ్డీ కడుతున్నారా ? అంటూ కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ ఆర్థిక శాఖ స్పెషల్ సీఎస్ రామకృష్ణారావుపై ప్రశ్నల వర్షం కురిపించింది. హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ భవన్‌లో కాళేశ్వరం న్యాయ విచారణ కొనసాగింది. చైర్మెన్ పీసీ ఘోష్ కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వైఫల్యం, ప్రాజెక్టుకు సంబంధించి అనేక అంశాలపై ప్రశ్నాస్త్రాలను సంధించారు. ఈ సందర్భంగా కమిషన్ కాళేశ్వరం ప్యాకేజీలకు సంబంధించిన డిజైన్లు, కమిషన్ పేరిట తీసుకున్న అప్పులు, బడ్జెట్ తదితర అంశాలపై కూడా ప్రశ్నించింది. కార్పొరేషన్‌కు నిధులు ఎలా సమకూర్చారని అడిగింది. డిజైన్లకు బాధ్యత ఎవరిదని ప్రశ్నించ గా అంతా ప్రభుత్వానిదేనంటూ రామకృష్ణారావు సమాధానమిచ్చారు. పరిశ్రమలకు నీళ్లు అమ్మడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. నిర్మాణంలో కోర్ కమిటీ రికార్డులు లేవని కమిషన్ ముందు చెప్పారు. ప్రాజెక్టుకు సంబంధించి ఫైళ్లు క్యాబినెట్‌లో ఆమోదం పొందలేదంటూ రామకృష్ణారావుకు కమిషన్ ఫైళ్లను చూపింది. అసెంబ్లీలో కాళేశ్వరం ప్రాజెక్టు భౌతికపరమైన విధానాల నివేదికను పెట్టలేదని కమిషన్ గుర్తు చేసింది. నిధుల విడుదల విషయంలో బిజినెస్ రూల్స్ పాటించలేదనీ, ఆర్థికపరమైన అంశా ల్లోనూ రికార్డులు నిర్వహించలేదని తెలిపింది. ప్రాజెక్టు కోసం ప్రభుత్వం గ్యారెంటీతోనే కార్పొరేషన్ రుణాలు తీసుకుందనీ, తొమ్మిది నుంచి 10.5శాతం వడ్డీతో రుణాలు చెల్లిస్తున్నామని రామకృష్ణారావు వివరణ ఇచ్చారు. మొత్తం 24 ప్రశ్నలకు సంబంధించి రామకృష్ణారావు నుంచి కమిషన్ సమాధానాలు రాబట్టినట్టు సమాచారం. బుధవారం నవయుగ కంపెనీకి చెందిన ముగ్గురిని, గురువారం మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించి ఎల్‌అండ్‌టీ కంపెనీ ప్రతినిధులను విచారించనుంది. అలాగే శుక్రవారం సుందిళ్ల బ్యారేజీ పనులు చేసిన ఆఫ్కాన్ కంపెనీ ప్రతినిధులను విచారణకు పిలవాలని కమిషన్ భావిస్తున్నది.

# అమరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మిస్తాం

**– సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.సుధా భాస్కర్**

**– ఆ పార్టీ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం**

**– ఈనెల 21 నుంచి 28 వరకు కొనసాగింపు**



సంగారెడ్డి: తెలంగాణ సాయుధ పోరాట అమరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్. సుధా భాస్కర్ అన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా మంగళవారం సంగారెడ్డి పట్టణంలోని వీరనారి ఐలమ్మ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్. సుధాభాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాట వారసత్వం కలిగిన పార్టీ సీపీఐ(ఎం) అని, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ నుంచి విముక్తి కోసం ప్రజలను పోరాటంలోకి దింపి నైజాం నవాబును తరిమి కొట్టిందని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాత్ర లేని బీజేపీకి దాని గురించి మాట్లాడే హక్కు ఎక్కడిదన్నారు. పాలక పార్టీలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆలోచించడం లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేస్తున్నాయని తెలిపారు. పోరాడి సాధించుకున్న చట్టాలను మార్చి పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. ప్రధాని మోడీ అనుసరిస్తున్న విధానాలతో దేశంలో పేదరికం పెరిగిపోతున్నదన్నారు. పెట్టుబడిదారీ విధానాలు అమలు చేస్తున్న దేశాలన్నీ సంక్షోభాలకు నిలయాలుగా మారుతున్నాయని, సోషలిస్టు దేశాలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ప్రపంచంలో సోషలిజం అజేయమని, కమ్యూనిస్టు పార్టీలు మాత్రమే ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేస్తున్నాయని, దేశానికి కేరళ వామపక్ష ప్రభుత్వం ఆదర్శమన్నారు. సంగారెడ్డి పట్టణంలో జనవరి 25 నుంచి 28వరకు జరుగుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల్లో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాల రూపకల్పన చేస్తామని చెప్పారు. కాగా జనవరి 21నుంచి 28వ తేదీ వరకు ఫొటో ఎగ్జిబిషన్ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యం.అడివయ్య, జిల్లా కార్యదర్శి జి.జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మల్లేష్, ఏ.మాణిక్, జి.సాయిలు జిల్లా కమిటీ సభ్యులు యం.యాదగిరి, నాయకులు సురేష్, బాలరాజు, సాయిలు,అలీ బాయి, వైకుంఠం, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# సిగ్నల్ రావాలంటే గుట్టలు, చెట్లు, ఇండ్లు ఎక్కాల్సిందే

- ఏజెన్సీలో బీఎస్ఎన్ఎల్ సేవలు అందేనా..?
- మా గ్రామంలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ వేయండి..
- నేలవంచ గిరిజనుల వేడుకోలు




గూడూరు: నెట్‌వర్క్ ఏదైనా 4జీ సేవలు పొందేందుకు వీలుగా కొత్తగా ఇంటర్ సర్కిల్ రోమింగ్ ఫీచర్‌ను ప్రారంభించినట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సేవలు ఏజెన్సీ ప్రాంతాల్లో ఉంటాయా అన్న దానిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి ఏజెన్సీ ప్రజలకు 4జీ సేవలు అందించడం కోసం సెల్ టవర్ల నిర్మాణం చేపడుతున్నా బీఎస్ఎన్ఎల్ టవర్లు పూర్తి స్థాయిలో పనిచేయడం లేదు. అడవి ప్రాంతాల్లో జీవనం కొనసాగించే గిరిజనులకు సెల్ సిగల్ కష్టాలు తప్పడం లేదు. గూడూరు మండలంలోని ఉట్ల, మట్టెవాడ గ్రామపంచాయతీ పరిధిలోని కనీసం రహదారిలేని దొరవారి తిమ్మాపురంలో బీఎస్ఎన్ఎల్ టవర్లు నిర్మించినా నేలవంచ గిరిజనులకు నేటికీ సిగల్ కష్టాలు తప్పడం లేదు. గిరిజన ప్రాంతాల్లో సిగల్స్ అందకపోవడంతో ప్రభుత్వపరంగా పలు రకాలైన సేవలు స్తబ్ధతగా మారాయి. కొద్ది రోజుల క్రితం దొరవారి తిమ్మాపురం బీఎస్ఎన్ఎల్ టవర్‌కు సిగల్ అందడంతో సంబరపడ్డ గిరిజనులకు కొద్ది రోజుల్లోనే నిరాశ మిగిలింది. సిగల్ పూర్తిగా నిలిచిపోయింది. ఊట్ల గ్రామంలో నిర్మించిన బీఎస్ఎన్ఎల్ టవర్‌కి సిగల్ పాయింట్ అందడం లేదు. దాంతో బీఎస్ఎన్ఎల్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్లారు. అయినా ఎలాంటి పురోగతి లేదు. ముఖ్యంగా కొంగరగిద్ద, నేలవంచ, ఊట్ల, దొరవారి తిమ్మాపురం గ్రామాల్లో సిగల్స్ సమస్య నేటికీ కొనసాగుతుంది. సిగల్ రావాలంటే తప్పనిసరిగా చెట్లు, ఇండ్ల పైకి, సమీపంలోని గుట్టల పైకి రావలసిన పరిస్థితి నెలకొంది. డిజిటల్ భారత్‌గా తీర్చిదిద్దుతామంటున్న కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఏజెన్సీ ప్రాంతాల్లో సెల్ టవర్లను నిర్మించి సేవలందించాలని కోరుతున్నారు.

# లగచర్ల రైతులకు బెయిల్



హైదరాబాద్: గ్రీన్ ఫార్మా సిటీ ఏర్పాటు కోసం భూసేకరణలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టిన అధికారులపై దాడికి పాల్పడ్డారనే కేసులో నలుగురు రైతులకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. గతంలో ఒక కేసులో బెయిల్ ఇచ్చింది. వాళ్లు విడుదలైన మరుసటి రోజునే పోలీసులు మరో కేసులో అరెస్టు చేసిన విషయం విదితమే. ఈ కేసులో రైతుల నుంచి రూ.25 వేల పూచీకత్తు తీసుకుని విడుదల చేయాలని కందిలోని సంగారెడ్డి జైలు సూపరింటెండెంట్‌కు ఆదేశాలు జారీ చేసింది. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలో అధికారులపై దాడికి సంబంధించిన కేసులో ఆరెస్టయిన ఎం. రమేష్, ఎం. గోపాల్ నాయక్, ఎం. మాదరయ్య, పి. మంగ్యానాయక్‌లను విడుదల చేయాలని మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కౌంటరు దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. విచారణను ఫిబ్రవరి 12కు వేసింది.

**కేంద్రానికి నోటీసులు**

లైంగిక దాడి ఘటనల్లో మహిళల రక్షణకు చర్యలు తీసుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ చీఫ్ కేఏ పాల్ పిల్ దాఖలు చేశారు. ఈ పిల్‌లో నాలుగు వారాలుగా కేంద్ర ప్రభుత్వం కౌంటర్ వేయకపోవడంతో హైకోర్టు ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఇదే చివరి అవకాశమనీ, కౌంటర్ వేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. విచారణను ఫిబ్రవరి 4కి వాయిదా వేస్తూ హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. 'లైంగికదాడికి పాల్పడిన వ్యక్తికి శిక్ష పడిన మూడు నెలల్లోగా అతని ఆస్తిలో 50 శాతం బాధితురాలికి ఇవ్వాలి. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలి. ఆ తరువాత నెలలోగా కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలి. కోర్టు మూడు నెలల్లోగా తీర్పు చెప్పాలి' అని పిల్‌లో పాల్ పేర్కొన్నారు.

# భావితరాలకు ఉపయోగపడే విధంగా మంథని

## అభివృద్ధి శ్రీధర్ బాబు తోనే సాధ్యం

### –ఐటి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలభిషేకం చేసిన కాంగ్రెస్ నాయకులు




మంథని: భావితరాలకు ఉపయోగపడే విధంగా మంథని నియోజకవర్గంలో అభివృద్ధి అనేది రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తోనే సాధ్యమవుతుందని మంథని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనియాడారు. మంథని పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టేషన్ ఆవరణలో మంథని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆయిలి ప్రసాద్,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోలు శివ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సాదుల శ్రీకాంత్ ల ఆధ్వర్యంలో మంథని,కాళేశ్వరం బస్టాండ్ల విస్తరణ కొరకు 4 కోట్ల 90లక్షల నిధులు మంజూరు చేయించిన రాష్ట్ర ఐటీ,పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పెంద్రు రమా సురేష్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు ఎరుకల ప్రవీణ్,ఎస్సి సెల్ డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుదుల వెంకన్న, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్ జీ లు మాట్లాడుతూ రానున్న రోజులలో జనాభాను దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా మంథని బస్టాండ్ ని 95 లక్షల రూపాయలతో అత్యధిక హంగులతో విస్తరణ చేయడానికి,కాళేశ్వరం బస్టాండ్ ని ఆధునిక హంగులతో 3.95కోట్ల రూపాయలతో నిర్మించడానికి మంత్రి శ్రీధర్ బాబు ఆర్టీసీ బోర్డు యాజమాన్యంతో మాట్లాడి నిధులు మంజూరు చేయించడం జరిగిందని వారికి మంథని ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.దూర ప్రాంతాల నుండి శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు ఎక్కువ మొత్తంలో వెళు తుండడంతో అలాగే రానున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని పెద్ద మొత్తంలో అభివృద్ధి అనేది చేయడం జరుగుతుందని తెలిపారు.

మా నాయకులు సింగపూర్, దావూస్ పర్యటనలో ఉన్నా కూడా మంథని ప్రాంతానికి మంచి రవాణా సౌకర్యం కల్పించాలని ఉద్దేశం తోటి నిధులు మంజూరు చేయించడం జరిగిందని అన్నారు.ప్రతి ఒక్క పనిని ఏ సమయంలో ఏం చేయాలో మంత్రి శ్రీధర్ బాబు కు తెలుసునని అన్నారు. కొద్ది రోజులలో రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇండ్లు రైతు భరోసా వంటి మరి కొన్ని పథకాలను ప్రజలకు అందుతాయని, ప్రజలు ఎవరు కూడా దళారులను నమ్మి మోసపోకూడదని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని ఇది ప్రజా ప్రభుత్వం అని తెలిపారు. ఈ కార్యక్రమంలొ మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, కౌన్సిలర్లు వికె రవి, నక్క నాగేంద్ర, చోప్పకట్ల హనుమంతు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదరి శంకర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల కమల్,బీసీ సెల్ జిల్లా కార్యదర్శి మంథని సురేష్ ,కిసాన్ సెల్ మండల అధ్యక్షులు అర్థం సదానందం,ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షులు అర్ల నారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్లు దొరగొర్ల శ్రీనివాస్,సేమంతుల ఓదెలు, ఎరుకల మధు, సీనియర్ నాయకులు పెరవెన లింగయ్య, అజీమ్ ఖాన్, లైసెట్టి రాజు,నరెడ్ల కిరణ్,కొయ్యల మొండి, దేవేందర్,రోడ్డ రాజేశ్వర్,కొంతం శ్రీను,గుండా రాజు, కావటి సమ్మయ్య,తీగల సమ్మయ్య, ఎండి అంకుష్, రామకృష్ణ, అలీమ్ ఖాన్, ఐసన్,పొనగంటి రమేష్,అక్కపక సది, నితీష్,ఎరుకల రమేష్ బాబు,సురేష్,చంద్రు విజయ్,ఎరుకల నిరంజన్,రాజు,కొరవెన కుమార్, పొరాండ్ల రంజిత్,బూడిద రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ లో ఆర్ఆర్ఆర్ రెడీ...

హైదరాబాద్: హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సంగతి తెలిసిందే. హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు గేమ్ ఛేంజర్ అయితే.. రీజినల్ రింగుం రోడ్డు సూపర్ గేమ్ ఛేంజర్ అని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. ఉత్తర, దక్షిణ రెండు భాగాలుగా చేపడుతున్న ఈ ప్రాజెక్టులో ఇప్పటికే ఉత్తర భాగానికి సంబంధించి టెండర్ల పక్రియ మె?దలైంది. ఇక రీజినల్ రింగు రోడ్డు చుట్టూ రీజినల్ రింగు రైల్ నిర్మించాలని రేవంత్ సర్కారు కోరుతోంది. హైదరాబాద్ రీజినల్ రింగురోడ్డుకు అనుసంధానంగా రీజినల్ రింగు రైల్వే లైనును మంజూరు చేసి త్వరతగతిన పూర్తి చేయాలని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోదీని కోరారు.కాగా, గతంలోనే రీజినల్ రింగు రైలుపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కీలక అప్డేట్ ఇచ్చారు. రీజినల్ రింగు రైలు మంజూరుకు కేంద్రం రెడీగా ఉందని పలు సందర్భాల్లో వెల్లడించారు. కొత్తగా నిర్మించబోయే రీజినల్ రింగ్ రోడ్డుకు అవతల దీన్ని నిర్మించనున్నట్లు చెప్పారు. తాజాగా.. రీజినల్ రింగు రైలుకు సంబంధించిన ఫైనల్ లొకేషన్ సర్వే పూర్తి అయింది. దాని అలైన్‌మెంట్, డీపీఆర్ తయారీపై రైల్వేశాఖ కసరత్తు ప్రారంభించింది. ఈ ఏడాది జూన్ నాటికి డీపీఆర్‌ను రైల్వే బోర్డుకు సమర్పించనున్నట్లు సమాచారం. రీజినల్ రింగు రైల్ ఫైనల్ లొకేషన్ సర్వే కోసం రైల్వేశాఖ రూ.13.95 కోట్లను గత బడ్జెట్‌లో మంజూరు చేసింది. హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేటు సంస్థకు కన్సల్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే లైడార్ ఆధారిత సర్వే పూర్తి చేసి.. ప్రాథమిక అలైన్‌మెంటును రెడీ చేశారు. దీని ప్రకారం ఈ ప్రాజెక్టు వ్యయం దాదాపుగా రూ.26,000 కోట్లు ఉంటుందని అంచనా. హైదరాబాద్ నగరంలోని ప్రధాన స్టేషన్లలోకి గూడ్స్ ట్రైన్లు రాకుండా..నగరం వెలుపలి నుంచే వెళ్లిపోయేలా రీజినల్ రింగ్ రైల్ ప్రాజెక్టుకు ప్రణాళికను రెడీ చేస్తున్నారు. ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు ఓటర్ రింగు రోడ్డు నుంచి 40 కి.మీ దూరంతో నిర్మిస్తుండగా.. ఆర్‌ఆర్‌ఆర్ ఆవల దాదాపు 5 కిలోమీటర్ల దూరంలో రింగు రైలు నిర్మించేలా.. రైల్వే శాఖ లైడార్‌తో ప్రాథమిక అలైన్‌మెంట్‌ను రూపొందించింది.. రీజినల్ రింగ్ రైల్ పొడవు 394 నుంచి 420 కిలోమీటర్ల మధ్య ఉండే ఛాన్స్ ఉంది. భూ సేకరణ ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించనున్నాయి. ఈ ప్రాజెక్టులో దాదాపు 25 వరకు రైల్వేస్టేషన్లు కొత్తగా ఏర్పాటయ్యే ఛాన్స్ ఉంది.మాసాయిపేట వద్ద సికింద్రాబాద్? నిజామాబాద్ లైన్, వంగపల్లి వద్ద సికింద్రాబాద్ ?వరంగల్ లైన్, వలిగొండ వద్ద సికింద్రాబాద్? గుంటూరు రైల్వేలైన్, గుల్లగూడ వద్ద సికింద్రాబాద్? తాండూరు లైన్, గజ్వేల్‌వద్ద సికింద్రాబాద్? సిద్దిపేట లైన్‌ను, బాలానగర్ వద్ద కాచిగూడ? మహబూబ్‌నగర్ లైన్‌ను రీజినల్ రింగ్ రైల్ క్రాస్ చేయనుంది. కాగా, త్వరలోనే ఈ ప్రాజెక్టు పట్టాలెక్కే ఛాన్స్ ఉందని రైల్వే అధికారులు చెబుతున్నారు. అదే జరిగితే తెలంగాణ ముఖ చిత్రం పూర్తిగా మారిపోనుంది. మరింత వేగంగా అభివృద్ధి జరగనుంది.

# పార్టీ ఫిరాయింపులపై గులాబీ మైండ్ గేమ్

హైదరాబాద్: ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం ప్రజాప్రతినిధిగా ఎన్నికయిన పార్టీకి రాజీనామా చేసినా ఇతర పార్టీ సభ్యత?వం తీసుకు న్నా అనర్హులవుతారు. ఈ చట్టం ప్రకారం ఇప్పటికే కాంగ్రెస్ లో చేరిన పది మంది ఎమ్మెల్యేలు అనర్హతా వేటుకు గురయ్యే అర్హత సాధించినట్లే. కానీ అదే చట్టంలో అనర్హతా వేటు ఎవరు వేయాలో నిర్దేశించారు. ఈ విషయంలో స్పీకర్ నిర్ణయమే ఫైనల్. తప్పుడు అఫిడవిట్ సమర్పించారని.. మరో విధమైన ఉల్లంఘనకు పాల్పడ్డారని ఎవరైనా ఎమ్మెల్యేపై కోర్టులు అనర్హతా వేటు వేసిన తీర్పులు ఉన్నాయి కానీ ఇలా పార్టీ ఫిరాయింపుల కింద అనర్హతా వేటు వేసిన తీర్పులు గతంలో లేవు. అదే సమయంలో నిర్ణయం తీసుకోవాలని కోర్టులు కూడా ఆదేశించలేవు.సభా వ్యవహారాల్లో స్పీకర్ ను ఆదేశించే అధికారం కోర్టులకు లేదని నిపుణులు చెబుతున్నారు. భారత రాష్ట్ర సమితి తరపున గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారి పై వేటు వేయిం చేదాకా పోరాటం చేయాలని బీఆర్ఎస్ డిసైడ్ అయింది. అందుకే అన్ని రకాలుగా బీఆర్ఎస్ లీగల్ టీంతో కసరత్తులు చేయించి తాజాగా సుప్రీంకోర్టులో తమ వాదనను బలపరిచేలా రెండు పిటిషన్లు వేయించా రు. 10 మంది ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేసిన 9 నెలలు అవుతున్నా.. స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని బీఆర్ఎస్ పిటిషన్‌లో పేర్కొంది. హైకోర్టు తీర్పు ఇచ్చి 6 నెలలైనా ఇప్పటికీ స్పీకర్ చర్యలకు ఉపక్రమించలేదని కోర్టుకు బీఆర్ఎస్ తెలిపింది. కనీసం నోటీసు కూడా ఇవ్వలేదని పిటిషన్‌లో బీఆర్ఎస్ పేర్కొంది. గతంలో కేశం మేఘా చంద్ర కేసులో ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోర్టును బీఆర్ఎస్ కోరింది. పార్టీల ఫిర్యాదులపై స్పీకర్ మూడు నెలల్లో నిర్ణయం చెప్పాలని కేశం మేఘా చంద్ర కేసులో తీర్పు వచ్చిందని .. ఆ తీర్పునకు అనుగుణంగా స్పీకర్ నిర్ణయం తీసుకోవట్లేదని బీఆర్ఎస్ తెలిపింది. నాలుగు వారాల్లో స్పీకర్ నిర్ణయం తీసుకునేలా ఆదేశాలివ్వాలని బీఆర్ఎస్ కోరుతోంది. తెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్‌కు అనుకూల నిర్ణయం రాకపోవడంతో సుప్రీంకోర్టుకు వెళ్లారు. సింగిల్ బెంచ్ ధర్మాసనం నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. కానీడివిజన్ బెంచ్ మాత్రం స్పీకర్ విచక్షణ మేరకు నిర్ణయం మేరకు నిర్ణయం తీసుకోవాలని కాలపరిమితి లేదని తీర్పు చెప్పింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టుకు వెళ్లింది. ఫిరాయించిన ఎమ్మెల్యేలపైఖచ్చితంగా అనర్హతా వేటు వేయిస్తామని కేటీఆర్ అదే పనిగా చెబుతున్నారు. త్వరలోనే పది నియోజకవర్గాల్లోను ఉపఎన్నికలు జరుగుతాయని కేటీఆర్ బాగా నమ్మకంతో చెప్పారు. తెలంగాణలో మాత్రమే కాదు ఏపీ,కర్నాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర లాంటి రాష్ట్రాల్లో కూడా పెద్దఎత్తున ఫిరాయిం పులు జరిగాయి. అయితే ఎవరి మీదా అనర్హత వేటుపడింది లేదు. ఫిరాయింపులకు వ్యతిరేకంగా వచ్చిన ఫిర్యాదులపై తొందరగా నిర్ణయంతీసుకోమని స్పీకర్, ఛైర్మన్లకు కోర్టులు సూచనలు ఇస్తాయి కానీ.. ఫలానా చర్య తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసిన సందర్భం లేదని నిపుణులు చెబుతున్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని తెచ్చారు కానీ టైమ్ ఫ్రేమ్ లేకుండా స్పీకర్‌దే నిర్ణయమని చెప్పడం ద్వారా.. మొత్తం చట్టం ఉద్దేశం నిర్వీర్యమైపోయింది. ఆ కారణంగానే గతంలో బీఆర్ఎస్ లో చేరిన ఎమ్మెల్యేలపై స్పీకర్ ఏ నిర్ణయం తీసుకోలేదు. ఇప్పుడు కాంగ్రెస్ వంతు.ఈఅంశంపై బీఆర్ఎస్‌కూ స్పష్టత ఉందని .. ఇంకా పార్టీలుమారే ఎమ్మెల్యేలు ఉంటే వారిని ఆపడానికి ఈ ప్రయత్నమని బీఆర్ఎస్ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి.

# కాళేశ్వరం టెన్షన్....

కరీంనగర్: బీఆర్ఎస్ కీలక నేతలకు కష్టాలు రెట్టింపు అయ్యాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, ఈటెల రాజేందర్ చుట్టూ ఉచ్చు బిగుస్తున్నట్లు కనిపిస్తోంది. రేపో మాపో కమిషన్ వీరికి నోటీసులు ఇవ్వాలని ఆలోచన చేస్తోంది. వారికి వ్యతిరేకంగా బలమైన సాక్షాధారాలను సిద్ధం చేసింది. ఇప్పటివరకే సేకరించిన ఆధారాలతో మాజీలను విచారించే పనిలో నిమగ్నమైనట్లు సమాచారంకేవలం పైసలు కోసం నిబంధనలకు తిలోధకాలు ఇచ్చినట్టు అంచనాకు వచ్చింది. ముఖ్యంగా రూల్స్ బ్రేక్ చేసి మరీ, అప్పట్లో అధికారులు ఆనాటి ప్రభుత్వ పెద్దలకు అన్నివిధాలుగా సహకరించినట్టు గుర్తించింది. ఈ ప్రాజెక్టుపై కాగ్ లేవనెత్తిన అంశాలు, విజిలెన్స్ రిపోర్టు, అఫిడవిట్లు వంటి నివేదికలను జ్యుడీషియల్ కమిషన్ పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం. ఇప్పటివరకు బ్యారేజీలు, పంప్ హౌస్‌ల నిర్మాణం, సివిల్ వర్క్స్ వరకు పరిమితమైన అవినీతి,చివరకు విదేశాల నుంచి తెచ్చిన మోటార్ల కొనుగోలులో భారీగా అవకతవకలు జరిగినట్టు గుర్తించింది కమిషన్. కాళేశ్వరంపై విచారణ చేపట్టిన పీసీ ఘోష్ కమిషన్, ఆసక్తికర విషయా లు బయటకు తీసినట్టు సమాచారం.కాళేశ్వరం కమిషన్ల ప్రాజెక్టుగా మారిపోయినట్టు తెలుస్తోంది. కింది నుంచి పైస్థాయి వరకు ఏజెన్సీలు ముడుపులు ముట్ట జెప్పినట్టు ప్రభుత్వ వర్గాల మాట. ఈ క్రమంలో ప్రాజెక్టు అంచనాలను అమాంతంగాపెంచేశారు. ప్రాథమికంగా కొన్ని అంశాలను జ్యుడీషియల్ కమిషన్ నిర్ధారించినట్టు అంతర్గత సమాచారం. 204 పేజీలతో ప్రాథమిక రిపోర్టు ఘోష్ కమిషన్ రెడీ చేసింది. మార్చిలోగా తుది నివేదికను ప్రభుత్వానికి ఇవ్వనుంది. కాళేశ్వరం కమిషన్ మళ్లీ ఓపెన్ కోర్టు నిర్వహించనుంది. అప్పటి ఫైనాన్స్ స్పెషల్ సీఎస్, ఇతర ఆర్థిక శాఖ అధికారులను మళ్లీ ప్రశ్నించ నుంది. ఎందుకంటే గతంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు రుణాల సమీకరణ కోసం అనుమతుల జారీలో ఆర్థికశాఖ కీలకపాత్ర పోషించింది. కార్పొరేషన్‌కు లేని ఆదాయాన్ని ఉన్నట్లు చూపించి రుణాలు సేకరించినట్టు తెలుస్తోం ది.క్రమంలో అధికారులతోపాటు అప్పటి బీఆర్ఎస్ నేత ప్రకాష్ తోపాటు బ్యారేజీల నిర్మాణ సంస్థల ప్రతినిధులను రెండురోజుల్లో విచారించ నుంది. మొత్తానికి కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్ పార్టీ కొంప కొల్లేరు చేయడం ఖాయమనే వాదన అప్పుడే నేతల్లో బలంగా వినిపిస్తోంది.

# ఆందోళన అవసరం లేదు అందరికీ లబ్ధి చేకూరుతుంది

### – ప్రజాపాలన గ్రామసభల్లో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి

వనపర్తి: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాలు ప్రతి ఒక్కరికి అందుతాయని ఎవరు కూడా ఆందోళన చెందకూడదని నిరంతరాయంగా జరిగే ఈ ప్రక్రియ ద్వారా ప్రజలందరికీ లబ్ధి చేకూరుతుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన గ్రామసభల సందర్భంగా మంగళవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ,ఘణపురం మండలం ఉప్పర్ పల్లి, పెద్దమందడి మండల చీకరుచెట్టు తండా, ముందరి తండాలలో నిర్వహించిన గ్రామసభల్లో జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, స్థానిక సంస్థల కలెక్టర్ సంచిత్ గాంగ్వర్, లతో కలిసి గ్రామసభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 26వ తేదీ నుంచి అమలయ్యే రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్ల పథకాలకు అర్హత గల లబ్ధిదారుల ఎంపిక నిమిత్తం చేపట్టిన ఈ గ్రామసభలలో అర్హత గల వారిని గుర్తించాలని, ఎవరైనా దరఖాస్తు చేసుకోని వారు ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చని ఎమ్మెల్యే సూచించారు గ్రామాలలో నిర్వహించే సమావేశాల్లో పాల్గొని అర్హత గల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే సూచించారు.

ఈ కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, ఆయా మండలాల, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తాసిల్దార్లు వ్యవసాయ అధికారులు ప్రత్యేక ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో స్నేహం సంబంధాలు పెంపొందుతాయి

### జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్



కోరుట్ల: యువత ఆరోగ్యం కాపాడుకోవడానికి, స్నేహం పెంపొందించు కోవడానికి క్రీడలే ముఖ్యం అని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. కోరుట్ల పట్టణంలోని కాలేజీ గ్రౌండ్లో నిర్వహిస్తున్న మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు మెమోరియల్ ,కోరుట్ల ప్రైమర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రీమియర్ లీగ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ హాజరై కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ జువ్వాడి నర్సింగరావు, ఆర్డీవో జివాకర్ రెడ్డి, మెట్ పెల్లి డిఎస్పీ రాములు లతో కలిసి ప్రారంభించారు. ముందుగా జువ్వాడి నర్సింగరావు కలెక్టర్ కి పుష్ప గుచ్చం ఇచ్చి సదర స్వాగతం పలికారు.ఆనంతరం మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.గత ఐదు సంవత్సరాలుగా కోరుట్ల పట్టణం లో ఐపీఎల్ మాదిరిగా కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ కోరుట్ల క్రికెట్ క్లబ్ నిర్వహించనుంది. 25 రోజులు జరగనున్న ఈ క్రికెట్ టోర్నమెంట్ 12 జట్లు పోటీపడుతున్నాయి.కోరుట్ల ప్రాంతంలోని దరఖాస్తు చేసుకున్న క్రీడాకారులను వేలంపాట ద్వారా టీం యజమానులుసెలెక్ట్ చేసుకున్నారు.ఈ సంధర్భంగాజిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువత ఆరోగ్యం కాపాడుకోవడానికి, స్నేహం పెంపొందించుకోవడానికి క్రీడలే ముఖ్యం ఆని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాముఖ్యత నిచ్చి యంగ్ ఇండియన్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ని హైదరాబాద్ లో స్థాపించడం జరిగిందని,అలాగే జిల్లాలలో కూడా క్రీడలను ప్రోత్సహించా లని ప్రభుత్వం ఆదేశించిందన్నారు.కోరుట్లలో స్వచ్ఛందంగా క్రీడలను ప్రోత్సహిస్తూ టోర్నమెంట్లు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి టోర్నమెంట్లు మరిన్ని గ్రామీణ, పట్టణాల్లో ప్రాంతాల్లో నిర్వహించాలని కోరుతున్నామన్నారు.కోరుట్లలో క్రీడల కోసం అవసరమైన సౌకర్యాలని,భూములను పరిశీలించి కేటాయిస్తామని కలెక్టర్ తెలిపారు.అనంతరం జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయని, ప్రతీ ఒక్కరు క్రీడలు, వ్యాయామాన్ని జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థు లు చదువుతోపాటు క్రీడలలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమం లో, ఆర్డీవో జివాకర్ రెడ్డి ,మెట్ పెల్లి డిఎస్పీ,రాములు, క్రికెట్ స్పోర్ట్స్ యాజమాన్యం క్రీడాకారులు,మెట్ పల్లి డిఎస్పీ రాములు, కోరుట్ల ఆర్డీవో జీవాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుమల గంగాధర్,కొంతం రాజం,అంజిరెడ్డి,అన్నం ఆనిల్, గడ్డమీద పవన్,జింధం లక్ష్మీ నారాయణ, మధు,వసీమ్,వసీద్, రహీం,ఆన్వర్, కౌన్సిలర్లు,మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ వివిధ హోదా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులందరూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

### ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి జిల్లా ఎస్పీ

వనపర్తి : వనపర్తి జిల్లా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్ షాప్ కు ముఖ్య అతిథిగా వనపర్తి జిల్లా ఎస్పీ ఆర్ గిరిధర్ రావుల హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిధర్ రావుల మాట్లాడుతూ విద్యార్థులు అందరూ కూడా సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని విద్యార్థులు విద్యార్థి దశ నుంచే తమ యొక్క వ్యక్తిత్వాన్ని మెరుగుపరచుకొని సమాజంలో అత్యున్నతమైన పౌరులుగా తయారీ కావాలి అని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపల్ ఈశ్వరయ్య మాట్లాడుతూ బ్యాంకులో లభించే వివిధ ఖాతాల గురించి మరియు చిన్నతనం నుంచే బడ్జెట్ పై, ఆర్థిక ప్రణాళిక పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంను ఉద్దేశించి సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి ఆంజనేయులు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలో ఈ వర్క్ షాప్ ను నిర్వహిస్తున్నామని ప్రతి ఒక్క విద్యార్థి కూడా ఈ వర్క్ షాప్ ద్వారా ఆర్థికపరమైన అంశాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని మనీ మేనేజ్మెంట్ గురించి కూడా తెలియజేశారు.ఈ వర్క్ షాప్ సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ వి. ఆంజనేయులు మరియు ప్రాజెక్ట్ మేనేజర్ వి.అశోక్ కుమార్ పర్యవేక్షణలో నిర్వహించడం అయినది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆఖటూ భాష నాయక్ , అరుణ గారు మాట్లాడుతూ విద్యార్థులు అందరూ కూడా బాగా చదువుకుంటే బ్యాంకులలో అనేక రుణాలు అందుబాటులో ఉన్నాయని వాటిని వినియోగించుకొని మంచిగా అభివృద్ధి చెందాలని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ంఒఆఓ సాయి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి కూడా నామిని గురించి పూర్తిగా తెలుసుకోవాలి అని సైబర్ నేరాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. అదేవిధంగా వనపర్తి యూనియన్ బ్యాంక్ మేనేజర్ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఏటీఎం ని ఎలా వినియోగించుకోవాలి మరియు ఉద్గం పోర్టల్ గురించి కూడా తెలియజేశారు.. అదేవిధంగా ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ అశోక్ మాట్లాడుతూ విద్యాలక్ష్మి పోర్టల్ గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మరొక రిసోర్స్ పర్సన్ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ కేవైసీ, పిన్ నెంబర్లను, ఓటిపి లాంటి వివరాలను ఇతరులకు తెలియజేయకూడదని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ట్రైనర్ శశికళ గారు మాట్లాడుతూ బ్యాంకులు అందించేటువంటి ఇన్సూరెన్స్ గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలని మరీ ముఖ్యంగా ఖఓూఃజ, ఖఓఏఏఃజ మీ యొక్క తల్లిదండ్రులకు తప్పకుండా బ్యాంకులో నమోదు చేసుకోవాలని తెలియజేశారు.

చివరిగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ శివుడు మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నతనం నుంచే పొదుపు అనేది చాలా ముఖ్యమని పొదుపు చేసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యొక్క అధ్యాపక బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడుపాలి

### నేరాల నియంత్రనకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి బుగ్గారం ఎస్ఐ మాడ శ్రీధర్ రెడ్డి

జగిత్యాల:ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడుపాలని, హెల్మెట్ తప్పనిసరి ధరించి ప్రాణాలు రక్షించుకోవచ్చని బుగ్గారం సబ్ ఇన్స్పెక్టర్ మాడ శ్రీధర్ రెడ్డి అన్నారు.త్రిబుల్ రైడ్, మద్యం తాగి, సెలఫోన్ మాట్లాడుతూడ్రైవింగ్ చేయకూడదని సూచించారు.రోడ్డు భద్రతా మాసం సందర్భంగా ఎస్సై శ్రీధర్ రెడ్డి బుగ్గారం మండలం లోని చందయ్యాపల్లెలో రోడ్డు భద్రత అవగాహన సదస్సు నిర్వహించి ప్రజలకు అవగాహనా కల్పించారు.ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నట్లయితే నేరాలు నియంత్రించవచ్చని తెలిపారు.గ్రామాల్లో దొంగతనాలు, మరే ఇతర నేరాలు జరిగిన సీసీ కెమెరాల ఏర్పాటుతో వాటిలో నిక్షిప్తమైన ఆధారాలతో వ్యక్తులను గుర్తించి పట్టుకోవచ్చని ఎస్సై తెలిపారు.మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని పేరెంట్స్ కు సూచించారు.మైనర్లు వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగినట్లయితే పేరెంట్స్ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. వాహనాధారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి డ్రైవింగ్ చేయాలనీ ఎస్సై శ్రీధర్ రెడ్డి సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎన్నం కిషన్ రెడ్డి, రాచెర్ల మల్లయ్య,మ్యాకల భీమేష్, బియ్యల మల్లయ్య, లక్ష్మారెడ్డి,వెంకటేష్,కొండ్ర లక్ష్మణ్,కొమురయ్య,చల్ల తిరుపతి,తదితరులు పాల్గొన్నారు.

# అత్యధిక సిక్స్ లు, ఫోర్లు బాదింది వీరే..

## కోహ్లీ, రోహిత్ మాత్రం కాదు

మరి కొద్ది రోజుల్లో ఛాంపియన్స్ ట్రోఫీ సమరం ప్రారంభం కానుంది. ఈ ట్రోఫీ కోసం క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పాకిస్థాన్ వేదికగా ఈ ప్రతిష్టాత్మక టోర్నీ జరగనుంది.

టీమిండియా మ్యాచుల వరకు మాత్రం దుబాయ్ లో నిర్వహించనున్నారు. ఇప్పటికే టీమిండియా జట్టును కూడా ప్రకటించారు. ట్రోఫీ దగ్గర పడుతున్న నేపథ్యంలో ఈ ఛాంపియన్స్ ట్రోఫీ ఎప్పుడు మొదలైంది, ఈ మెగా టోర్నీ చరిత్రలో ఎక్కువ బౌండరీలు, సిక్స్ లు బాదిన టీమిండియా బ్యాటర్లు ఎవరో తెలుసుకుందాం.




1998లో ఈ టోర్నీ ప్రారంభమైంది. అప్పటి నుంచి 2009 వరకు ప్రతీ రెండేళ్లకు ఓ సారి నిర్వహిస్తూ వస్తున్నారు. కానీ ఆ తర్వాత నుంచి నాలుగేళ్ల పాటు గ్యాప్ ఇస్తూ 2013, 2017లో నిర్వహించారు. అనంతరం మళ్లీ 8 ఏళ్లకు 2025లో ఇప్పుడు నిర్వహిస్తున్నారు. అంటే ఇది ఇప్పుడు 10వ ఎడిషన్.

ఈ ఛాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో శిఖర్ ధావన్ ఎక్కువ ఫోర్లు బాదాడు. 2013, 2017 ఎడిషన్లలో పాల్గొన్నాడు ధావన్. అప్పుడు 10 మ్యాచుల్లోని 10 ఇన్నింగ్స్ లో 79 ఫోర్లు కొట్టాడు.

ఆ తర్వాతి స్థానంలో టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఉన్నాడు. 1998 నుంచి 2004 వరకు 13 మ్యాచుల్లోని 11 ఇన్నింగ్స్ లో 66 సార్లు బంతిని బౌండరీ తరలించాడు.

మూడో స్థానంలో విరాట్ కోహ్లీ ఉన్నాడు. 2009-2017 మధ్యలో 13 మ్యాచుల్లో 12 ఇన్నింగ్స్ ఆడిన కోహ్లీ 53 ఫోర్లను నమోదు చేశాడు.

రోహిత్ శర్మ 2013 నుంచి 2017 వరకు 10 మ్యాచుల్లోని 10 ఇన్నింగ్స్ లో 51 ఫోర్లు బాదాడు.

సచిన్ తెందుల్కర్ ఈ జాబితాలో ఐదో స్థానంలో ఉన్నాడు. 1998 నుంచి 2009 వరకు ఆడిన మాస్టర్ 16 మ్యాచుల్లోని 14 ఇన్నింగ్స్ లో 49 ఫోర్లు బౌండరీ తరలించాడు.

# టీమిండియా జెర్సీలపై పాకిస్థాన్ పేరు...

## ఐసీసీ ఏం చెప్పిందంటే..!

**- ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో తెరపైకి మరో వివాదం**

**- టీమిండియా జెర్సీలపై పాకిస్థాన్ పేరు ఉండడానికి బీసీసీఐ నిరాకరణ**

**- ఈ వివాదంపై తాజాగా స్పందించిన ఐసీసీ**

**- టోర్నీ లోగోను తమ జెర్సీలపై ముద్రించడం ప్రతి జట్టు బాధ్యత అన్న ఐసీసీ**

**- అన్ని జట్లూ ఈ నియమానికి కట్టుబడి ఉండాలని సూచన**

ఫిబ్రవరి 19 నుంచి పాకిస్థాన్, దుబాయ్ వేదికలుగా జరగాల్సి ఉన్న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో మరో వివాదం తెరపైకి వచ్చింది. భారత జట్టు ధరించే జెర్సీలపై ఆతిథ్య దేశం పాకిస్థాన్ పేరు ఉండటాన్ని బీసీసీఐ నిరాకరిస్తున్నట్టు తెలుస్తోంది.

ఐసీసీ టోర్నీలలో భాగంగా ఆతిథ్య దేశపు పేరు, లోగోను జెర్సీపై ముద్రించడం ఆనవాయతీ. కానీ, బీసీసీఐ మాత్రం తాము ఆడేది దుబాయి వేదికగా కనుక పాకిస్థాన్ పేరును తమ ఆటగాళ్ల జెర్సీలపై ముద్రించబోమని చెబుతున్నట్లు సమాచారం. ఈ వివాదంపై తాజాగా ఐసీసీ స్పందించింది. ఛాంపియన్స్ ట్రోఫీ నిబంధనలను అన్ని దేశాలూ పాటించాల్సిందేనని సంబంధిత వర్గాలు స్పష్టం చేశాయి.

"టోర్నమెంట్ లోగోను తమ జెర్సీలపై ముద్రించడం ప్రతి జట్టు బాధ్యత. అన్ని జట్లూ ఈ నియమానికి కట్టుబడి ఉండాలి" అని ఐసీసీ అధికారి ఒకరు చెప్పినట్లు ఏ-స్పోర్ట్స్ పేర్కొంది.




ఆటగాళ్ల కిట్‌పై ఛాంపియన్స్ ట్రోఫీ లోగో, ఆతిథ్య దేశం పాకిస్థాన్ పేరుతో కనిపించకపోతే భారత జట్టుపై కఠిన చర్యలు తీసుకోవచ్చని అపెక్స్ బోర్డు పేర్కొంది.

ఐసీసీ నిబంధనల ప్రకారం, మ్యాచ్‌లు ఎక్కడ జరుగుతున్నాయనే దానితో సంబంధం లేకుండా జెర్సీలపై జట్లకు ఆతిథ్యం ఇచ్చేవారి పేరు రాయాలని తెలిపింది.

ఇదిలాఉంటే... గత కొన్ని నెలలుగా బీసీసీఐ, పీసీబీ మధ్య చాలా ఉద్రిక్తతలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా ఛాంపియన్స్ ట్రోఫీ కోసం తమ జట్టును పాకిస్థాన్‌కు పంపడానికి భారత బోర్డు నిరాకరించడం, చివరికి ఈ విషయంపై ఐసీసీ రాజీ కుదర్చడంతో హైబ్రిడ్ మోడల్‌లో టోర్నీ నిర్వాహణకు పాక్ అంగీకరించడం జరిగాయి. అయితే, భవిష్యత్తులో భారత్ ఆతిథ్యం ఇచ్చే ఐసీసీ టోర్నీలకు కూడా దాయాది దేశం మన దగ్గరకు రాకుండా తటస్థ వేదికలోనే ఆడనుంది. అలాగే బీసీసీఐ కొన్ని అదనపు రుసుములు కూడా చెల్లించాల్సి ఉంటుంది.

# అగ్రస్థానం బుమ్రాదే - పాపం రోహిత్ శర్మ.. మళ్లీ డౌన్!

ఐసీసీ తాజాగా ర్యాంకింగ్స్ ను విడుదల చేసింది. ఇందులో టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్‌లో టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా తన హవాను కొనసాగించాడు. 908 పాయింట్లతో తన అగ్రస్థానాన్ని పదిలంగా ఉంచుకున్నాడు. రీసెంట్ గా జరిగిన బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన బుమ్రా.. ఆ సమయంలోనే 907 పాయింట్లతో టాప్ లో నిలిచాడు. ఆ సిరీస్ లో 5 టెస్టుల్లో 13.06 సగటుతో 32 వికెట్లు తీశాడు. ప్లేయర్ ఆఫ్‌ది సిరీస్‌గానూ నిలిచాడు. ఇప్పుడు మరో పాయింట్ మెరుగుపరుచుకుని.. కెరీర్ బెస్ట్ పాయింట్స్ మార్క్ ను టచ్ చేశాడు. బుమ్రా తర్వాతి స్థానాల్లో వరుసగా ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్(841), సౌతాఫ్రికా స్టార్ పేసర్ కగిసో రబాడ(837) ఉన్నారు. ఇక పాకిస్థాన్ నోమన్ అలీ.. వెస్టిండీస్ పై తొలి టెస్ట్ లో ఆరు వికెట్ల ప్రదర్శన చేసి 761 పాయింట్లతో టాప్10లోకి దూసుకెళ్లాడు. ఆల్ రౌండ్ ర్యాంకింగ్స్ లో జడేజా కూడా తన అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్నాడు. 400 పాయింట్లతో టాప్ లో నిలిచాడు. ఆస్ట్రేలియా పర్యటనలో అతడు నామమాత్రంగా ఆడాడు. ఈ సిరీస్‌లో మొత్తం ఐదు మ్యాచ్‌ల్లో బరిలోకి దిగిన జడేజా .. 27



యావరేజ్ తో 135 పరుగులు సాధించాడు. ఆ తర్వాత సౌతాఫ్రికా మార్కో జాన్సన్ (294), బంగ్లాదేశ్ మెహ్దీ హాసన్(263) ఉన్నారు.

ఇక బ్యాటర్ల ర్యాంకింగ్స్ లో రోహిత్ శర్మ ఒక స్థానం దిగజారి కిందకు పడిపోయాడు. ? 43వ ర్యాంక్‌లో నిలిచాడు. హిట్ మ్యాన్ ఆస్ట్రేలియా సిరీస్ లో తీవ్రంగా నిరాశపరిచిన సంగతి తెలిసిందే. ఐదు ఇన్నింగ్స్‌ల్లో కేవలం 31 పరుగులు మాత్రమే చేశాడు.

# కపిల్ దేవ్ రికార్డ్‌పై కన్నేసిన మహమ్మద్ షమీ!

టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ షమీని అరుదైన ఘనత ఊరిస్తోంది. గాయంతో గత 15 నెలలుగా ఆటకు దూరంగా ఉన్న షమీ.. ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా మరికాసేపట్లో(బుధవారం) ప్రారంభమయ్యే తొలి మ్యాచ్‌తో రీఎంట్రీ ఇవ్వనున్నాడు.

అయితే ఈ మ్యాచ్‌లో షమీ 2 వికెట్లు పడగొడితే అంతర్జాతీయ క్రికెట్‌లో 450 వికెట్ల మైలురాయి అందుకోనున్నాడు. ఈ ఘనత సాధించిన నాలుగో పేసర్ కపిల్ దేవ్ సరసన షమీ నిలవనున్నాడు. ఈ జాబితాలో కపిల్ దేవ్(687), జహీర్ ఖాన్(597), జవగల్ శ్రీనాథ్(551) మహమ్మద్ షమీ కన్నా ముందున్నారు. ఓవరాల్‌గా అనిల్ కుంబ్లే 401 మ్యాచ్‌ల్లో 953 వికెట్లతో అగ్రస్థానంలో ఉండగా.. రవిచంద్రన్ అశ్విన్ 287 మ్యాచ్‌ల్లో 765 వికెట్లతో రెండో స్థానంలో నిలిచాడు. హర్భజన్ సింగ్ 365 మ్యాచ్‌ల్లో 707 వికెట్లు, కపిల్ దేవ్ 356 మ్యాచ్‌ల్లో 687 వికెట్లు, రవీంద్ర జడేజా 351 మ్యాచ్‌ల్లో 597 వికెట్లు, జహీర్ ఖాన్ 351 మ్యాచ్‌ల్లో 597 వికెట్లతో, జవగళ్ శ్రీనాథ్ 296 మ్యాచ్‌ల్లో 551 వికెట్లు తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. 2013లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన మహమ్మద్ షమీ 4.12 ఎకానమీతో 448 వికెట్లు పడగొట్టాడు. ఇంగ్లండ్‌తో జరిగే తొలి టీ20లో రెండు వికెట్లు తీస్తే షమీ 450 వికెట్ల మైలురాయిని అందుకోనున్నాడు.

చీలమండ, మోకాలి గాయాలతో షమీ గత 15 నెలలుగా భారత జట్టుకు దూరంగా ఉన్నాడు. వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్లో



చివరిసారిగా అతను టీమిండియా తరఫున ఆడాడు.

గాయం నుంచి కోలుకోవడానికి చాలా కష్టపడ్డానని షమీ తెలిపాడు. "బౌలింగ్ చేయడం, కారు డ్రైవింగ్ చేయడం లేదా గాలి పటం ఎగరేయడం.. ఏదైనా సరే చేయాలంటే ముందు మానసికంగా బలంగా ఉండాలి. ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలి. అప్పుడే మనం ఏ పైనా చేయగలం. పరుగులు చేస్తూ, వికెట్లు తీసే సమయంలో ప్రతిఒక్కరూ మన చుట్టే ఉంటారు. కానీ అసలైన పరీక్ష అది కాదు. కష్ట సమయాల్లో మనతో ఎవరు ఉంటారనేది తెలుసుకోగలగాలి. దాదాపు ఏడాది కాలం పాటు నేను అదే చూశా. చాలా కష్టపడ్డాను. భయంగానే పరిగెత్తాను. ఇప్పుడు ఆ స్టేజ్ దాటేశాను. కఠినంగా శ్రమిస్తేనే.. ఫలితాలు గొప్పగా ఉంటాయి." అని షమీ అన్నాడు.

# 'బానే పాడావ్.. ముందు ఆటపై ఫోకస్ చేయ్'

## - సంజూ శాంసన్ పై సూర్యకుమార్ సెటైర్!

ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో మరోసారి సంజూ శాంసన్ గురించి తీవ్ర చర్చ సాగుతోన్న సంగతి తెలిసిందే. అందుకు కారణం అతడిని ఇంగ్లాండ్ వన్డే సిరీస్ తో పాటు ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేయకపోవడమే. అయితే సంజూ మాత్రం ఈ విషయం గురించి ఆలోచిస్తున్నాడో లేదో తెలీదు కానీ.. ప్రస్తుత సమయాన్ని ఎంచక్కా హ్యాపీగా గడుపుతున్నాడు. ఈ క్రమంలోనే సంజూ శాంసన్ ఓ సూపర్ హిట్ బాలీవుడ్ సాంగ్ ను కూడా పాడి ఫ్యాన్స్ తో పాటు తన తోటి క్రికెటర్లను అలరించాడు. తాను పాడిన పాటను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అభిషేక్ నాయర్ తో కలిసి 'జీతా వోహి సికందర్' సాంగ్ ను పాడి దానికి ఫీడ్ బ్యాక్ ఇవ్వండి అంటూ కోరాడు. "సాధ్యం కానిది అంటూ ఏమీ లేదు. నేను పాట పాడు. నేను ముంబయికి వచ్చేయనా?(బాలీవుడ్)" అంటూ క్యాప్షన్ రాసుకొచ్చాడు.

అయితే దీనికి సూర్య కుమార్ యాదవ్ ఫన్నీ రిప్లై ఇచ్చాడు. "నువ్వు ముంబయి వస్తావు. కానీ అంతకన్నా ముందు చెన్నై, రాజ్ కోట్ , పుణెకు వచ్చాకే రావాలి." అని బదులిచ్చాడు.

కాగా, జనవరి 22 నుంచి టీమిండియా.. ఇంగ్లాండ్ తో వన్డే సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ కు సంజూ శాంసన్ వికెట్ కీపర్ గా




ఎంపికయ్యాడు. తొలి మ్యాచ్ కోల్ కతా వేదికగా జరగనుంది. ఆ తర్వాత చెన్నై, రాజ్ కోట్, పుణె వేదికగా మిగతా మ్యాచ్ లు నిర్వహించనున్నారు. ఈ మ్యాచ్ వేదికలను ఉద్దేశించే సూర్య కుమార్ యాదవ్ రిప్లై ఇచ్చాడు. ముందు మ్యాచ్ లపై ఫోకస్ పెట్టు అన్నట్టుగా సూచించాడు. ఇకపోతే ఇప్పటికే తొలి మ్యాచ్ కోసం టీమిండియా కోల్ కతాకు చేరుకుంది. ప్రాక్టీస్ సెషన్ కూడా ప్రారంభించింది. అక్కడే తన జట్టు సభ్యులతో ఉన్న సంజూ శాంసన్ పాటను పాడాడు.

# చెన్నై టీమ్ కొత్త జెర్సీ ఇదే.. విడుదల చేసిన హీరోయిన్ సమంత!

మరో రెండు రోజుల్లో వరల్డ్ పికెల్ బాల్ లీగ్ ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. జనవరి 24 నుంచి ప్రారంభం కానుంది. అయితే ఈ లీగ్ లో పాల్గొనే తన జట్టు చెన్నై సూపర్ ఛాంప్స్ కు సంబంధించిన కొత్త జెర్సీని హీరోయిన్ సమంత లాంఛ్ చేసింది.

వరల్డ్ పికిల్ బాల్ లీగ్ లో చెన్నై సూపర్ ఛాంప్స్ ఫ్రాంఛైజీని హీరోయిన్ సమంత కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఆమె ఆ జట్టుకు యజమానిగా వ్యవహరిస్తోంది. సామ్ కొనుగోలు చేయడంతోనే ఈ గేమ్ ఇక్కడ చాలా మందికి పరిచయమైంది. అయితే తాజాగా ఆమె తన జట్టుకు సంబంధించిన కొత్త జెర్సీని లాంఛ్ చేసింది. చెన్నైలోని సత్యభామ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్ స్టిట్యూట్ లో స్పెషల్ ఈవెంట్ ను నిర్వహించి ఈ జెర్సీని విడుదల చేసింది. రెడ్, ఎల్లో కలర్ కాంబినేషన్ లో ఈ జెర్సీని డిజైన్ చేశారు.

జెర్సీ లాంఛ్ చేసిన తర్వాత టీమ్ తో కలిసి సెల్ఫీలకు పోజులిస్తూ సందడి చేసింది సమంత. ఈ ఈవెంట్లో సమంత ధగధగ మెరిసిపోతూ కనిపించడంతో.. ఆమె అందానికి ఫ్యాన్స్ ఫిదా అయ్యారు. ఇక ఈవెంట్ లో సమంత మాట్లాడుతూ.. లీగ్ లో అద్భుతంగా రాణించాలని తమ జట్టుకు ఆల్ ది బెస్ట్ తెలిపింది. పికెల్ బాల్ ఎక్సైటింగ్ స్పోర్ట్ అని చెప్పిన సామ్.. ఫిట్ నెస్, కాంపిటీషన్, ఫన్ పరంగా ప్రజలను దగ్గర చేస్తుందని చెప్పుకొచ్చింది.

జనవరి 24 నుంచి ప్రారంభం కానున్న ఈ వరల్డ్ పికెల్ బాల్ లీగ్ లో చెన్నై సూపర్ ఛాంప్స్ జట్టు తమ మొదటి మ్యాచ్ ను బెంగళూరు




జవాన్స్ తో తలపడనుంది. ఈ లీగ్ లో మొత్తం ఆరు జట్లు బరిలోకి దిగనున్నాయి.

పికిల్ బాల్ గేమ్ అంటే ఇదే

పికిల్‌బాల్ గేమ్ 1965లో అమెరికాలో మొదలైంది. ఇప్పుడిప్పుడే ఈ ఆటకు మన దగ్గరా ఆదరణ దక్కుతోంది. అంతర్జాతీయంగా ఈ గేమ్ లో పెద్ద టోర్నీలే నిర్వహిస్తారు. టెన్నిస్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్‌ను పోలి ఉంటుందీ ఈ పికిల్‌బాల్ గేమ్. ఇండోర్ లేదా అవుట్‌డోర్‌లో ఈ గేమ్‌ను ఆడొచ్చు. సింగిల్స్‌లో ఇద్దరు, డబుల్స్‌లో నలుగురు కలిసి ఆడతారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో కూడా ఈ గేమ్ ను నిర్వహిస్తుంటారు. ఆటలో హార్డ్ ప్లాస్టిక్ బాల్, చెక్కతో చేసిన పాడిల్‌ను ఉపయోగిస్తారు.

# కోహ్లీ-రోహిత్.. మీరేం ఆట కంటే గొప్ప కాదు: యువరాజ్ సింగ్ తండ్రి

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీలు దేశవాళీ క్రికెట్ ఆడాలని మాజీ క్రికెటర్, మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ తండ్రి యోగ్ రాజ్ సింగ్ సూచించాడు.

ఆట కంటే ఎవరూ గొప్ప కాదని.. క్రికెట్ దిగ్గజాలైన సర్ వివియన్ రిచర్డ్స్, సర్ డాన్ బ్రాడ్‌మన్‌లు కూడా క్రికెట్ తర్వాతేనని అభిప్రాయపడ్డాడు.

అందుబాటులో ఉన్న టీమిండియా ఆటగాళ్లంతా తప్పనిసరిగా దేశవాళీ క్రికెట్ ఆడాలని ఇటీవల బీసీసీఐ రూల్ పెట్టిన విషయం తెలిసిందే. వరుస పరాజయాల నేపథ్యంలో జట్టును గాడిన పెట్టేందుకు బీసీసీఐ.. కొత్తగా 10 కఠిన నిబంధనలను తీసుకొచ్చింది. ఈ 10 రూల్స్‌పై అధికారిక ప్రకటన రాకపోయినా.. మీడియాకు లీకయ్యాయి. ఈ రూల్స్‌పై స్పందించిన యోగ్ రాజ్ సింగ్.. ఎవరైనా సరే అందుబాటులో ఉన్నప్పుడు దేశవాళీ క్రికెట్ ఆడాలన్నాడు.

'ఆట కంటే ఎవరూ తోపు కాదు. వివ్ రిచర్డ్స్, డాన్ బ్రాడ్‌మన్‌లు కూడా క్రికెట్ కంటే గొప్ప వాళ్లు కాదు. వాళ్లే కాదు ఎవరూ కూడా ఆట కంటే గొప్పవాళ్లు కాలేరు. కాబట్టి విదేశీ పర్యటనల నుంచి తిరిగొచ్చిన అనంతరం ఆటగాళ్లు కచ్చితంగా దేశవాళీ క్రికెట్ ఆడాలి. సీనియర్ టెస్ట్ ప్లేయర్స్ దేశవాళీ క్రికెట్ ఆడితే.. మిగతా కుర్రాళ్లలో ఆత్మవిశ్వాసం రెట్టింపు అవుతోంది.

భారత జట్టుకు దూరంగా ఉన్నప్పుడు నా కొడుకు(యువరాజ్ సింగ్) దేశవాళీ క్రికెట్ ఆడేవాడు. అతను తరుచూ రంజీ ట్రోఫీలో బరిలోకి



దిగేవాడు. భారత జట్టుకు సిరీస్, టోర్నీ లేకుంటే ఆటగాళ్లంతా దేశవాళీ క్రికెట్ ఆడాలి. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు కూడా దేశవాళీ క్రికెట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి. ఫిట్‌నెస్ క్యాంప్‌లతో ఒరిగేది ఏం లేదు. నెట్స్‌లో ఏం ఉండదు. కథంతా మ్యాచ్‌లోనే ఉంటుంది.'అని యోగ్‌రాజ్ సింగ్ చెప్పుకొచ్చాడు. అంతర్జాతీయ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలతో పాటు ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లకు దూరంగా ఉన్న భారత ఆటగాళ్లందరికి దేశవాళీ క్రికెట్ ఆడే సమయం ఉంది. రోహిత్ శర్మ, రిషభ్ పంత్, మహమ్మద్ సిరాజ్ రంజీ ట్రోఫీ ఆడేందుకు సిద్ధమవుతున్నారు. విరాట్ కోహ్లీ ఆడటంపై మాత్రం సందిగ్దత నెలకొంది. అతను ప్రస్తుతం మెడనొప్పితో బాధపడుతున్నట్లు తెలుస్తోంది.

# గంభీర్‌కు కాస్త సమయమివ్వండి: గంగూలీ

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు స్నేహశిష్ గంగూలీ అండగా నిలిచాడు. కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన గంభీర్‌కు కాస్త సమయమివ్వాలని సూచించాడు. టీ20 ప్రపంచకప్ 2024 విజయానంతరం రాహుల్ ద్రవిడ్ హెడ్ కోచ్ బాధ్యతల నుంచి తప్పుకోగా.. గంభీర్ నూతన కోచ్‌గా ఎంపికైన విషయం తెలిసిందే. ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్‌ల మెంటార్‌గా వ్యవహరించిన గంభీర్ ఆ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా 12 ఏళ్ల తర్వాత కేకేఆర్‌కు ఐపీఎల్ టైటిల్ అందించాడు. దాంతో టీమిండియా కోచ్‌గా గంభీర్‌ను నియమించాలనే డిమాండ్ వ్యక్తమైంది. కోచ్‌గా గంభీర్ అద్భుత ఫలితాలు సాధిస్తాడని అంతా భావించారు. కానీ టీమిండియా దారుణంగా విఫలమైంది. శ్రీలంక గడ్డపై వన్డే సిరీస్ కోల్పోవడంతో పాటు న్యూజిలాండ్ చేతిలో సొంతగడ్డపై 3 టెస్ట్‌ల సిరీస్‌లో క్లీన్ స్వీప్ అయ్యింది. ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని 1-3తో కోల్పోయింది. 8 టెస్ట్‌ల్లో మూడు విజయాలు నమోదు చేయలేక డబ్ల్యూటీసీ ఫైనల్ రేసు నుంచి తప్పుకుంది.

ఈ క్రమంలోనే గంభీర్‌పై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. కోచ్‌గా గంభీర్ విఫలమయ్యాడనే వాదన తెరపైకి వచ్చింది.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**